PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 120 | విజయవాడ, సోమవారం 2 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 2 December 2024 | Rs

అదానీ కుంభకోణంపై మోడీ నోరు విప్పాలి
- మోడీ, జగన్, చంద్రబాబులకూ వాటా
- విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి
- సిపిఎం తిరుపతి జిల్లా మహాసభలో వి శ్రీనివాసరావు

3

టీమిండియా ఆల్‌రౌండ్ షో
రాణించిన గిల్, యశస్వి
ఆకట్టుకున్న నితీశ్, వాషింగ్టన్
వార్మప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పిఎం ఎలెవన్‌పై భారత్ ఘన విజయం
6 నుంచి రెండో టెస్ట్



6

ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి

- రిజర్వేషన్ల కుదింపు చర్యలతో ఉద్యోగాలు దూరం
- ప్రయివేటీకరణ చర్యలతో ఉపాధికి ఎసరు
- అటవీ సంపదపైనా కార్పొరేట్ల పెత్తనం
- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ సదస్సులో బృందాకరత్ ఆందోళన



జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న బృందాకరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలతో ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి జరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, రిజర్వేషన్ల కుదింపు, మినహాయింపు చర్యల వల్ల ఆదివాసీలు, ఇతర అణగారిన తరగతులకు చెందిన ప్రజలు ఉద్యోగాలకు, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని చెప్పారు. ఆదివారం స్థానిక హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం), సెంటర్ ఫర్ ఆదివాసీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. ఆదివాసులను ఉద్యోగాల నుండి దూరం చేస్తున్నారన్న అంశంపై ఎఎఆర్ఎం ఛైర్మన్ జితేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి వందలాది మంది గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఆదివాసీ హక్కులు, ఉద్యోగాలపై దాడికి పూనుకుందని విమర్శించారు. అలాగే ఆదివాసుల భూములను అక్రమంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. దీంతో అటవీ సంపదపైనా కార్పొరేట్ కంపెనీలు పెత్తనం సాగిస్తున్నాయని చెప్పారు. వీటిపై ఎఎఆర్ఎం పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కేంద్రంలోని బిజెపి విధానాల వల్ల ఆదివాసీ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణ, వివిధ మినహాయింపులతో ప్రభుత్వ ఉద్యోగాల నుంచి ఆదివాసీలను దూరం చేస్తున్న తీరుపై సదస్సులో డేటాను ప్రదర్శించారు. ఈ డేటాను ప్రస్తావిస్తూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కును కూడా మోడీ సర్కార్ నీరుగారుస్తోందని తెలిపారు. మంచ్ చైర్‌పర్సన్ జితేంద్ర చౌదరి, మంచ్ జాతీయ కన్వీనర్ పులిన్ బాస్కే మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం మరింత ఉధృతంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. భూమి నుండి, అడవి నుండి, సంపద నుండి, ఇప్పుడు ఉద్యోగాల నుండి కూడా ఆదివాసీలను తరిమివేసే కుట్రలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం)లో 8.6 శాతం ఆదివాసులు ఉంటే, 7.5 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నారని అన్నారు. ఎందుకు అలా? 8.6 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ వికాస్ రావల్ సమర్పించిన ముసాయిదా నివేదికలో ఎస్‌టి జనాభాను తక్కువగా అంచనా వేశారని, అందువల్ల సి, డి కేటగిరిల్లో ఎక్కువ ఉద్యోగాలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ చేశారని తెలిపారు. అందులో కూడా ఎస్‌టిలకు తప్పని సరిగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2014 మోడీ అధికారంలోకి వచ్చేనాటికి మొత్తం కేంద్ర ప్రభుత్వ పోస్టుల సంఖ్య 32 లక్షలకు పైగా ఉన్నాయని, 2023లో దాదాపు 30 లక్షలకు తగ్గాయని తెలిపారు. 2014లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో దాదాపు 4.2 లక్షల ఖాళీలు ఉన్నాయని, అయితే ఇప్పుడు ఖాళీల సంఖ్య 5 లక్షలు పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌నుంచి వి.తిరుపతిరావు, కె.సత్యన్నారాయణ, డి. ప్రభాకర్, బి. తౌడన్న, టి.చిట్టిబాబు, తెలంగాణ నుంచి ధర్మానాయక్, సచిన్, శోభన్ నాయక్, భీంరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంఘాల నేతలు కరుమలయన్ (సిఐటియు), బి.వెంకట్ (ఎఐడబ్ల్యుయు), అర్చన ప్రసాద్ (ఐద్వా), నత్తు ప్రసాద్ (డిఎస్ఎంఎం), మురళీధరన్ (ఎన్‌పిఆర్‌డి) తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవే..
- ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమల్జేయాలి
- కాంట్రాక్ట్, డైలీ వేజ్, క్యాజ్‌వల్, అవుట్ సోర్సింగ్ పోస్టుల్లోనూ రిజర్వేషన్లు అమల్జేయాలి.
- ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్ వర్తింపజేయాలి.
- ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, టీచింగ్, ఇతర అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.
- పోస్టుల భర్తీలోనూ, ఉద్యోగోన్నతుల్లోనూ రిజర్వేషన్ అమలుపై సమగ్రమైన డేటాను రెగ్యులర్‌గా విడుదల చేయాలి.
- గ్రేడ్‌లు వారీగా మంజూరైన పోస్టులు, ఖాళీలతో కూడిన రిజర్వేషన్ల పరిస్థితిపై పూర్తిస్థాయి డేటాను ఇవ్వాలి.
- ఎస్‌టి కాంట్రాక్ట్ ఉద్యోగుల (గ్రేడ్‌ల వారీగా) డేటా ఇవ్వాలి.
- ప్రభుత్వసంస్థల ప్రయివేటీకరణ చర్యలు వీడాలి.

ములుగులో ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి
పదేళ్ల తర్వాత మళ్లీ నెత్తురోడిన చల్పాక అటవీ ప్రాంతం



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చల్పాక అటవీ ప్రాంతంలో ఆదివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డిసెంబర్ రెండు నుంచి ఎనిమిది వరకు వారోత్సవాలను జరుపుకోవాలని మావోయిస్టులు కరపత్రాలను ఇటీవల విడిచి వెళ్లారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు వారోత్సవాలను భగ్నం చేసేందుకు గుత్తికోయ గూడేలు, అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో అడవుల్లో మోహరించిన గ్రేహౌండ్స్ దళాలకు పులకమ్మ వాగు సమీపంలోని అడవిలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో మావోయిస్టులు ఎదురుపడడంతో ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో ఇల్లందు-నర్సంపేట ఏరియా దళ కమాండర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చేరమంగి గ్రామానికి చెందిన కురుసం మంగు అలియాస్ బద్రు అలియాస్ పాపన్న (35), ఏటూరునాగారం-మహాదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి, పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన గోలపు మల్లయ్య అలియాస్ మధు (43), ఎసిఎంగా పనిచేస్తున్న బీజాపూర్ జిల్లా ఉసురు గ్రామానికి చెందిన ముసాకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), భైరాంఘర్ గ్రామానికి చెందిన ఎసిఎం ముసాకి జమున (23), మావోయిస్టు పార్టీ సభ్యులు, ఇంద్రావతికి చెందిన జై సింగ్ (25), బీజాపూర్ జిల్లా గంగులూరు గ్రామానికి చెందిన కిషోర్ (22), ఉసూర్ గ్రామానికి చెందిన కామేష్ (23) ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. కాగా, పది సంవత్సరాల క్రితం ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం అడవుల్లో ఎన్‌కౌంటర్లు జరిగేవి. తాజా ఎన్‌కౌంటర్‌తో గిరిజన పల్లెల్లో మళ్లీ అలజడి మొదలైంది.

లొంగిపోవాలని హెచ్చరించాం : ములుగు జిల్లా ఎస్‌పి

మావోయిస్టులు మారుమూల పల్లెలో తలుదాచుకున్నారనే సమాచారం మేరకు గ్రేహౌండ్స్ దళాలు పల్లెలు, అడవుల్లో సోదాలు చేపట్టినట్టు ములుగు జిల్లా ఎస్‌పి శబరీష్ తెలిపారు. ఈ క్రమంలో చల్పాక ప్రాంతంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో సుమారు 15 మంది అనుమానాస్పదంగా కనిపించారని చెప్పారు. వారిని లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించినా వినలేదని తెలిపారు. ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారని, మిగిలిన వారు తప్పించుకున్నారని చెప్పారు. వారి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. ఘటనా స్థలాన్ని ములుగు డిఎస్‌పి రవీందర్, బయ్యారం డిఎస్‌పి రవీందర్ రెడ్డితో కలిసి ఎస్‌పి పరిశీలించారు.

మోడీ హయాంలో మైనార్టీలపై పెరిగిన దాడులు
- జర్మనీ మాజీ చాన్సలర్ మెర్కెల్

5

విషాదం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు వైద్యులు, ఒక న్యాయవాది
- మరో ప్రైవేట్ వైద్యునికి తీవ్ర గాయాలు
- అందరూ కర్ణాటక రాష్ట్రం బళ్లారి వారే



ప్రమాదంలో నుజ్జయిన కారు

ప్రజాశక్తి- ఉరవకొండ, రాయదుర్గం

అనంతపురం జిల్లా విడపనకల్లులో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో ఇద్దరు వైద్యులు, ఒక లాయరు ఉన్నారు. మరొక ప్రయివేట్ వైద్యుడు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వారు. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ గోవిందరాజులు (52), నేత్ర వైద్యులు డాక్టర్ యోగేష్ (54), న్యాయవాది వెంకట నాయుడు (53), ప్రయివేటు వైద్యులు డాక్టర్ అమరేగౌడ పాటిల్ కలిసి విహారయాత్రకు బ్యాంకాక్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బ్యాంకాక్ నుంచి బెంగళూరు విమానాశ్రయం చేరుకుని అనంతపురం మీదుగా బళ్లారికి కారులో వెళ్తున్నారు. కారును వెంకట నాయుడు నడుపుతున్నారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రంలో 42వ జాతీయ రహదారిపై చేలగురికి ఐదు కిలోమీటర్ల మిగతా 2లో

పుదుచ్చేరిలో ఫెంగల్ బీభత్సం

- కుదుటపడుతున్న చెన్నయ్
- ఆరుగురు మృతి

చెన్నయ్ : ఫెంగల్ తుపాను తాకిడికి అతలాకుతలమైన తమిళనాడు క్రమేపీ కుదుటపడుతోంది. తీరం దాటిన ఫెంగల్ తమిళనాడు, పుదుచ్చేరిలో పెను విధ్వంసాన్ని, విషాదాన్ని మిగిల్చింది. భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకు ఆరుగురు చనిపోయారు. కాగా ఆదివారం తెల్లవారుజామున రెండు గంటలకు కరైకల్, మహాబలిపురం మధ్య తుపాను తమిళనాడు తీరాన్ని దాటింది. అది బలహీనపడి పుదుచ్చేరి సమీపంలో అల్పపీడనంగా కొనసాగుతోంది. భారీ వర్షాల కారణంగా చెన్నయ్ నగరం జలమయం కావడంతో విమానాశ్రయాన్ని కొంతసేపు మూసివేశారు. పరిస్థితి మెరుగుపడడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత విమానాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించారు.

తుపాను కారణంగా చెన్నయ్‌లో విద్యుద్ఘాతానికి గురై ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. నగరంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించి బాధితులను పరామర్శించారు. సహాయ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. తుపాను ప్రభావం తగ్గడంతో చెన్నయ్ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారని చెప్పారు. భారీ వర్షాలు కురిసిన విల్లుపురం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మరో ముగ్గురు మంత్రులు సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారని వివరించారు. సెంట్రల్ చెన్నయ్‌లోని కోయంబేడు, విరుగంబాకం, నుంగంబాకం, టి.నగర్, ఆల్వార్‌పేట్ ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. విల్లుపురం జిల్లాలో ముందు జాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పరిస్థితిని ముఖ్యమంత్రి స్టాలిన్ నిరంతరం సమీక్షిస్తున్నారని, సహాయ పునరావాస కార్యక్రమాలను చేపట్టే బాధ్యతను విద్యుత్ మంత్రి వి.సెంథిల్ బాలాజీ, రవాణా మంత్రి శివశంకర్‌కు అప్పగించారని అటవీ శాఖ మంత్రి పొన్ముడి చెప్పారు.

భారీ వర్షాల కారణంగా కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో జనజీవనం స్తంభించింది. అక్కడ అత్యధికంగా 46 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తుపాను తాకిడికి అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అనేక కాలనీలు నీట మునిగాయి. వరద నీటిలో చిక్కుకుపోయిన ప్రజలు కొన్ని గంటల పాటు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వచ్చింది. రోడ్ల మీద నిలిపిన ద్విచక్ర వాహనాలు, కార్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. పాండిచ్చేరిలో తుపాను కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కొట్టకుప్పం, మరక్కనంలో 11 గోడ కూలిన ఘటనలు చోటుచేసుకున్నాయి. సైన్యం, ఎన్‌డిఆర్ఎఫ్ దళాలు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి.



పుదుచ్చేరిలో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న భారత ఆర్మీ దళాలు

రాష్ట్రంలో పలుచోట్ల భారీవర్షాలు

2


సెకి ఒప్పందంపై సంకోచమెందుకు?

- రద్దుకు మార్గాలున్నాయి
- అదాని ప్రాజెక్టులపై దర్యాప్తు చేపట్టండి
- సిఎంకు ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదాని - సెకి - రాష్ట్రప్రభుత్వం మధ్య జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవచ్చునని కేంద్ర మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ రాష్ట్రప్రభుత్వానికి సూచించారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేయడంలో రాష్ట్రప్రభుత్వం సంకోచించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇటీవల ఆయన లేఖ రాశారు. 2014 నుంచి ప్రభుత్వాలు అదాని కంపెనీలకు ఎన్నో విధాలుగా భూములను, ఇతర వనరులను ఉదారంగా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయడం అవసరమని పేర్కొన్నారు. అదాని కుంభకోణానికి సంబంధించిన సెకి ఒప్పందాన్ని రద్దుచేయడం వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రావని భయపడుతున్నట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో సంకోచించాల్సిన అవసరం లేదని, ముడుపులు చెల్లించి, ప్రజలకు నష్టం కలిగించే పెట్టుబడిదారులను రాష్ట్రం బహిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్టాలను గౌరవించి, ప్రజా ప్రయోజనాలు నెరవేర్చే పెట్టుబడులనే రాష్ట్రం ప్రోత్సహించాలని కోరారు. అదాని సెకి ఒప్పందంలో కొన్ని క్లాజ్‌ల కింద, ప్లాంట్ యాజమాన్యాలు ముడుపులు చెల్లించిన విషయాల ఆధారంగా, ఫోర్స్ మేజరె కింద ప్రభుత్వ ఒప్పందాన్ని రద్దు చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రప్రభుత్వం సిబిఐ, ఇడి, సిబిడిటిలతో కేంద్రం దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బిఐ నుంచి వివరాలు సేకరించి సమగ్రంగా దర్యాప్తు చేయించాలని కోరారు. అదాని ప్రమేయం ఉండటం వల్ల కేంద్రప్రభుత్వం అంగీకరించకపోతే రాష్ట్రం దర్యాప్తు చేయవచ్చని తెలిపారు. సెకి ఒప్పందంపై హైకోర్టులో గతంలో టిడిపి సీనియర్ నేత, ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్, సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ కేసులు వేశారని, వీటిపై ఇంకా తీర్పులు రాలేదని పేర్కొన్నారు. ఈ కేసులలో గత రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన తప్పుడు ఆఫిడవిట్లను వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఒప్పందం రద్దు విషయంలో అభ్యంతరం లేదని అమెరికా కోర్టు వివరాలతో హైకోర్టులో ఆఫిడవిట్ దాఖలు చేయాలని సూచించారు. అదాని - సెకి ఒప్పందం కారణంగా విద్యుత్ వినియోగదారులపై మోపిన 2021-22 ఎఫ్‌పిపిసిఎ చార్జీలను వెనక్కి తీసుకొని నష్టపరిహారం ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.3850 కోట్ల మేరకు గండి పడుతుందని, కాబట్టి అందుకు బాధ్యులైన నేతలు, అధికారుల నుంచి ప్రభుత్వం ఆ డబ్బులను వసూలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో నేతలు అదాని వంటి కంపెనీలకు అక్రమంగా ఇతర ప్రాజెక్టులను కూడా కట్టబెట్టారని తెలిపారు. కడప, సత్యసాయి, అనకాపల్లి, పార్వతీపురం జిల్లాల్లో 6,200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ఎటువంటి కాంపిటేటివ్ బిడ్డింగ్ లేకుండా అక్రమంగా అప్పజెప్పారని పేర్కొన్నారు. మన్యంలో ఇచ్చిన ప్రాజెక్టులు పీసా చట్టానికి, అటవీ హక్కుల చట్టానికి విరుద్ధంగా ఇచ్చారని వివరించారు. ప్రజలకు, ఆదివాసీలకు నష్టం కలిగే ఈ ప్రాజెక్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు కేంద్రప్రభుత్వంలోని నేతల ఒత్తిడితో అదాని కంపెనీ అధీనమైందని తెలిపారు. పోర్టులో ఉన్న రాష్ట్రవాటా 10.4 శాతాన్ని తక్కువ ధరకు అదానికి కట్టబెట్టిన నేతలు, అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల విద్యుత్ వినియోగదారులకు నష్టమని ఒక స్వచ్ఛంద సంస్థ రాష్ట్రప్రభుత్వానికి నివేదిక ఇచ్చినా అదానికి మిగతా 2లో


మళ్లీ పెరిగిన వాణిజ్య గ్యాస్ ధర



న్యూఢిల్లీ : దేశంలో వాణిజ్య ఎల్‌పిజి ధర మళ్లీ పెరిగింది. డిసెంబర్ నెల సమీక్షలో భాగంగా హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే 19 కేజీల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధరను ఆదివారం మళ్లీ రూ.16.5 పెంచారు. దీంతో వరసగా ఐదో నెల కూడా ఈ ఎల్‌పిజి ధర పెరిగింది. తాజా పెంపుతో 19 కేజీల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధర దేశ రాజధానిలో 1,818.5కు చేరుకుంది. విజయవాడలో రూ.17.5కి పెరిగి రూ.1979.5కి చేరింది. ఈ పెరిగిన ధర ఆదివారం నుంచే అమల్లోకి వచ్చింది. గత నెల సమీక్షలో ఈ సిలిండర్ ధర రూ.62 పెంచారు. గత ఐదు నెలల్లో మొత్తంగా రూ. 172.5 పెరిగింది. ఒక ఏడాదిలో ఇంత ధర పెరగడం ఇదే మొదటిసారి. అలాగే సమీక్షలో ఏవియేషన్ టర్బన్ ఫ్యూయిల్ (ఎటిఎఫ్) లేదా జెట్ ఫ్యూయిల్ ధరను కూడా 1.45 శాతం పెంచారు. దీంతో దేశరాజధానిలో ఒక కిలోలీటర్ (కెఎల్) ధర 91,856.84కు చేరకుంది. గత నెలలోనూ ఎటిఎఫ్ ధర పెరిగింది. ఈ సమీక్ష తరువాత గృహ అవసరాల ఎల్‌పిజి సిలిండర్ ధరలో మార్పులేదు. దేశరాజధానిలో 14.2 కేజీల సిలిండర్ ధర రూ.803గా ఉంది.

అజ్మీర్ దర్గాలో సర్వే ఓ సైద్ధాంతిక దాడి

- ప్రధాని మోడీకి 12 మంది మాజీ అధికారులు, దౌత్యవేత్తల లేఖ
- చట్టవిరుద్ధ కార్యక్రమాల నిలిపివేతకు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



న్యూఢిల్లీ : రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో సర్వే చేయాలని స్థానిక కోర్టు ఆదేశించడాన్ని 'ఒక సైద్ధాంతిక దాడి'గా మాజీ అధికారులు, దౌత్యవేత్తలు విమర్శించారు. ఇలాంటి చట్ట విరుద్ధమైన, హానికరమైన కార్యక్రమాలు నిలిపివేయడానికి జోక్యం చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మోడీకి గత నెల 29న లేఖ రాసారు. అజ్మీర్ దర్గాలో సర్వే చేయాలనే ఆదేశం భారతదేశ వారసత్వం, ఐక్యంగా ఉండాలనే దేశపు ఆలోచనను వక్రీకరిస్తుందని లేఖలో విమర్శించారు. ఇలాంటి చట్ట వ్యతిరేక, హానికరమైన కార్యక్రమాలను మోడీ మాత్రమే ఆపగలరని, ఎందుకంటే 12వ మత గురువు ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ వార్షిక ఉర్సు సందర్భంగా ఈ దర్గాకు చాదర్ పంపినట్లు మోడీ స్వయంగా ప్రకటించారని లేఖలో గుర్తు చేశారు. ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గరవ్నర్ నజీబ్ జంగ్, ఇంగ్లండ్‌లో భారత హైకమిషనర్‌గా పని చేసిన శివ్ ముఖర్జీ, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్ వై ఖరేషి, ఆర్మీ స్టాఫ్ మాజీ ఉపాధ్యక్షులు లెఫ్టినెంట్ జనరల్ జమానుద్దీన్ షా, ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ రవి వీర గుప్తా .. వంటి 12 మంది మాజీ అధికారులు, దౌత్యవేత్తలు లేఖ రాసారు. మధ్యయుగపు మసీదులు, దర్గాల్లో మిగతా 2లో

రోగిని తరలిస్తున్న అంబులెన్స్‌కు ప్రమాదం

నలుగురి మృతి

భోపాల్ : ఒక రోగిని కర్నూలు జిల్లా నుంచి బీహార్ తరలిస్తున్న అంబులెన్స్ ప్రమాదానికి గురవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో జరిగింది. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో ఆదివారం ఉదయం ఓ పాదచారుడిని ఢీకొట్టిన అంబులెన్సు ఆ తర్వాత స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడినట్లు పోలీసులు వెల్లడించారు. జబల్‌పూర్ –నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్ 34)పై చోటుచేసుకున్న ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా.. ఐదుగురికి గాయాలైనట్లు తెలిపారు.

అనిష్ షా (18) అనే రోగిని కర్నూలు నుంచి బీహార్‌లోని చంపారన్‌లో తమ స్వగ్రామానికి తరలిస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాదం సమయంలో అంబులెన్సులో ఇద్దరు డ్రైవర్లతో పాటు అనిష్ షా కుటుంబ సభ్యులు ఆరుగురు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో పాదచారుడిపైకి దూసుకెళ్లిన అంబులెన్సు.. ఆ తర్వాత ఓ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతులను ప్రమిత షా (35), ప్రిన్స్ షా (4), ముకేశ్ షా (36), సునీల్ షా (40)గా గుర్తించారు. క్షతగాత్రులను జబల్‌పూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఆందోళన

ప్రజాశక్తి – విజయవాడ

టిడిపి కూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపనుందని, పెంచుతున్న కరెంటు ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. విజయవాడ బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా జరిగింది. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నినదించారు. ధర్నానుద్దేశించి కాశీనాథ్ మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు పెంచబోమని టిడిపి కూటమి నాయకులు ఎన్నికల ముందు చెప్పారని, అధికారంలోకి వచ్చాక దశల వారీగా ట్రూ ఆప్ ఛార్జీల పేరుతో రూ.9,412 కోట్ల మేర భారాలు మోపుతున్నారని, ఇచ్చిన హామీని విస్మరించడం తగదన్నారు. అదానీ లాభాల కోసం కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పరితపిస్తున్నాయని, ప్రజల ప్రయోజనాలను ఆలోచించే పరిస్థితుల్లో లేవని ధ్వజమెత్తారు. గతంలో కరెంటు ఛార్జీలు పెంచడం వల్లనే టిడిపి అధికారం కోల్పోయిందని, మరలా అదే దుస్థితి టిడిపి కూటమి ప్రభుత్వానికి ఏర్పడుతుందని హెచ్చరించారు. అవినీతిలో కూరుకుపోయిన అదానీని



బీసెంట్ రోడ్డులో ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కాపాడడం కోసం మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ వెంపర్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ఉరితాళ్లుగా తయారైన స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు, టి.ప్రవీణ్, నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, ఎస్.కె పీరు సాహెబ్, పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

నివాస ప్రాంతాల్లో మద్యం షాపు వద్దు

- షాపు ఎదుట బైఠాయించి ఆందోళన

ప్రజాశక్తి – విజయవాడ

నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడ కృష్ణలంకలో కొద్దిరోజుల క్రితం ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని కోరుతూ షాపు ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. మద్యం షాపును తొలగించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మద్యం షాపులకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి ప్రజల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని తెలిపారు. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని కొద్ది రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. నివాసాలు, పాఠశాలలు, ఆస్పత్రులకు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. వెంటనే నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, తమ్మిన చంద్రశేఖర్, స్థానికులు సూర్యదేవర నాగేశ్వరరావు, దామోదరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నష్టదాయకమైన పిపిఎలు రద్దు చేయండి

- ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- యుఇఇయు గౌరవాధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థలకు నష్టాలను కలిగించే పిపిఎలను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. పిపిఎలలో అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ సమావేశం విజయవాడలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో ఇటీవల జరుగుతున్న మార్పులు సంస్థకు, ప్రజలకు, ఉద్యోగ, కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చేలా ఉన్నాయని తెలిపారు. అదాని, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు చేస్తున్నారని విమర్శించారు. పిపిఎల వల్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు మూతపడి ఉద్యోగులకు తీరని నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి సుదర్శన్ రెడ్డి, సుబ్బిరెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు హెచ్ఆర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు ఎరియర్స్ చెల్లించకపోవడం సరికాదన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలు ఇవ్వాలని, నూతనంగా ఏర్పడిన జిల్లాలకు కొత్త సిబ్బందిని ఏర్పాటుచేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్ ఉండాలని డిమాండ్ చేశారు. జెఎల్ఎం గ్రేడ్–2లను విద్యుత్ సంస్థ ఉద్యోగులుగా భావించి హక్కులు కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సంస్థల పరిరక్షణ కోసం, ఉద్యోగ కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం పెద్దయెత్తున ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సూరిబాబు, హెచ్ 129 నాయకులు మోహన్‌రావు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు, జెఎల్ఎం గ్రేడ్–2 ఉద్యోగులు కలిసి ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని కోరారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యాన సదస్సులు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. స్ట్రగుల్ కమిటీ నాయకులు రంగయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముజఫర్ అహ్మద్, డిస్కం నాయకులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నేతలు

ఓటరు నమోదును వినియోగించుకోండి

- 9 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి–విజయవాడ

పట్టభద్రుల ఓటు నమోదు కోసం ఈ నెల 9వ తేదీ వరకు ఆఖరి గడువుగా పొడిగిస్తూ ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు తమ ఓటను నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్సీ, కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ సుందరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ.. శాసన మండలి అనేది పెద్దల సభ అని, ఈ సభకు మేధావులను, విజ్ఞత కలిగిన వారిని పంపించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు పిడిఎఫ్ తరపున ఎన్నికైన ఎమ్మెల్సీలు శాసన మండలిలో ప్రజల గొంతుకై సమస్యలను వినిపిస్తున్నారని, అదే వారి విజయానికి కారణమని తెలిపారు. సమావేశంలో మధ్యతరగతి ఉద్యోగుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ అజయ్‌కుమార్, సిఐటియు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు), ప్రజారోగ్య వేదిక, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్, మెడికల్ రిప్స్ యూనియన్, పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, ఇపిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, శ్రామిక మహిళా, ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్, టాక్స్ పేయర్స్ అసోసియేషన్, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు, లయోల కళాశాల మాజీ వైస్ ప్రిన్సిపల్ ఎస్‌పి రామరాజు మాట్లాడారు. గడిచిన ఆరేళ్ల కాలంలో ఎమ్మెల్సీగా కెఎస్ లక్ష్మణరావు తమ రంగాలకు అందించిన తోడ్పాటు, ఆయన చేసిన సేవలను వివరించారు. ప్రభుత్వ రంగ పరిరక్షణకు, ఉద్యోగ, కార్మిక, శ్రామికుల సమస్యల పరిష్కారానికి లక్ష్మణరావు అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు.

రిషితేశ్వరి కేసుపై హైకోర్టులో

అప్పీలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి–గుంటూరు, అమరావతి బ్యూరో

రిషితేశ్వరికి న్యాయం చేయాలని, రిషితేశ్వరి కేసును రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని హైకోర్టులో అప్పీల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి లక్ష్మణరావు మాట్లాడుతూ ఎఎన్‌యు ఆర్కిటెక్చర్ విద్యార్థి రిషితేశ్వరి ర్యాగింగ్ వల్ల తాను సూసైడ్ చేసుకుంటున్నట్లు స్పష్టంగా తన డైరీలో రాసుకుందని తెలిపారు. సీనియర్ విద్యార్థుల వేధిస్తున్నారంటూ నిందితుల పేర్లు కూడా డైరీలో రాసుకుందన్నారు. అప్పటి ప్రిన్సిపల్ బాబూరావుతో సహా, ముగ్గురు సీనియర్ విద్యార్థులను నిందితులుగా చేర్చారన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత నిందితులకు ఎలాంటి శిక్ష లేకుండా కేసు కొట్టివేయడం బాధాకరమని తెలిపారు. ర్యాగింగ్ వల్ల ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా నిందితులకు శిక్ష పడకపోతే ర్యాగింగ్ ఎలా ఆగుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ కేసుపై హైకోర్టులో అప్పీలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె నళినికాంత్, కె.అనురాధ, అర్.స్వాతి, పి.భాష, ఐద్వా నాయకురాలు జి.రమణ, కె.పద్మ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ , జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

హైకోర్టులో అప్పీల్ చేయాలి :ఎస్ఎఫ్ఐ

నాగార్జున యూనివర్సిటీ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య కేసుపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దోషులకు శిక్ష లేకుండా కోర్టు కేసు కొట్టివేయడం పట్ల విచారం వ్యక్తం చేశారు. తాను వేధింపులు ఎదుర్కొంటున్నానని రిషితేశ్వరి డైరీలో రాసినట్లు పేర్కొన్నారు. హాయ్‌ల్యాండ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ నుంచి ఎదురైన వేధింపులు, ముగ్గురు విద్యార్థుల ర్యాగింగ్ గురించి పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా కోర్టు తీర్పు చెప్పడం శోచనీయమని తెలిపారు. వేధింపులకు గురవుతున్న ఆడపిల్లలు, తల్లిదండ్రులకు భరోసానిచ్చే విధంగా ఈ తీర్పు లేదని పేర్కొన్నారు.

రేపు మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల మూడున ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఈ నెల నాలుగున మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, అనివార్య కారణాల వల్ల 3వ తేదీకి మార్చినట్లు పేర్కొన్నారు. సచివాలయంలోని 1వ బ్లాక్ మంత్రివర్గ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందన్నారు.

'ఆత్యం'పై చర్యలు

- డిప్యూటీ సిఎంను కోరిన సిపిఐ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లా, గురుపల్లి మండలంలోని కొండలను ఆక్రమించి, అక్రమ మైనింగ్ చేస్తున్న ఆత్యం మైనింగ్ ప్రైవేటు లిమిటెడ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు పవన్‌కల్యాణ్‌కు ఆదివారం లేఖ రాశారు. మండలంలోని 10 గ్రామాల పరిధిలో కొండలను ఈ సంస్థ ఆక్రమించి తవ్వకాలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రశ్నించిన స్థానిక ప్రజలపై సంస్థ యాజమాన్యం దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. కొండలపై ఈ సంస్థ తవ్వకాల వల్ల వాగులు, వంకలు ధ్వంసమై వర్షపునీరు కొండ దిగువన ఉన్న వ్యవసాయ భూములకు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తాగునీరు కలుషితమై కిడ్నీ వ్యాధులతో ఇప్పటి వరకూ 12 మంది మృతి చెందినట్లు తెలిపారు. ఈ అంశంపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

మోడీ, అదానికి సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదం

ప్రధాని నరేంద్ర మోడీ, అదానికి సంబంధం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఎవరి చెవుల్లో పువ్వులు పెట్టడానికి ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రశ్నించారు. పురందేశ్వరి ఆ పార్టీలో చేరక ముందే మోడీ, అదాని మధ్య సంబంధ బాంధవ్యాలు ఉన్నాయని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో అదాని విమానంలో మోడీ దేశమంతా తిరిగి ప్రచారం చేశారన్నారు. సెకీ ఆధ్వర్యాన జరిగిన సోలార్ విద్యుత్తు ఒప్పందాల్లో 4 రాష్ట్రాల్లో అదాని రూ.2,100 కోట్లు లంచాలుగా ముట్టజెప్పిన ఆరోపణలు ఉన్నా, ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడైన సందర్భంలోనూ అదానిని మోడీ కాపాడారని, ఇప్పుడు అమెరికాలో ఎఫ్‌బిఐ కేసులో ప్రధానే కాపాడుతున్నారని విమర్శించారు.

ఫెంగల్ ఎఫెక్ట్

- రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు


అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐనవిల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి – యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో వర్షాలు పడడంతో పంట పొలాలు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు జిల్లాల్లో ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. కోతల సమయం కావడంతో తుపాను వల్ల ధాన్యం తడిసిపోతుందని, వరి చేలు నేలకొరుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తిరుమలలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు పూర్తిగా నిండిపోయాయి. ఆదివారం ఉదయం 8 గంటల సమయానికి మొత్తం ఐదు జలాశయాల్లో నీటి మట్టం దాదాపు పూర్తి స్థాయికి చేరుకుంది. నెల్లూరు నగరంలో పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం, కాకినాడ జిల్లా తాళ్లరేవు, సామర్లకోటలో వర్షానికి తోడు ఈదురుగాలులు వేగంగా వీయడంతో పలుచోట్ల పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ప్రభుత్వ పథకాల అమల్లో

కీలకంగా 'ఐవిఆర్ఎస్'

ఫీడ్ బ్యాక్‌ను బట్టి ముందుకెళ్లేందుకు ప్రభుత్వ కార్యాచరణ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో



ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుకు సంబంధించి అందుతున్న పౌర సేవలపై ప్రజల నుంచి నిరంతరం ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెరుగైన సేవలను నేరుగా లబ్ధిదారులకు అందించాలంటే వారి అభిప్రాయాలను తీసుకోవడం ద్వారా సత్ఫలితాలు అందించవచ్చని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవిఆర్ఎస్) ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇకపై లబ్ధిదారులకు ఆయా పథకాల అమలు జరుగుతున్న తీరు, ఎలా చేస్తే బాగుంటుంది? ఏమైనా మార్పులు చేర్పులు చేయాలా? అనే ప్రశ్నలతో ఐవిఆర్ఎస్ కాల్స్ వెళ్లనున్నాయి. వాటిపై ప్రజలిచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసుకుని ముందుకు నడవాలని భావిస్తోంది. ముఖ్యంగా ఇంటింటికీ పింఛన్లు, దీపం–2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు. పింఛన్ సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా? లేదా? దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులున్నాయా వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించనుంది. వీటితో పాటు ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్తపాలసీ అమలు వంటివాటిపైన ప్రస్తుతా నికి ప్రజల నుంచి అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించ`నుంది. రానున్న రోజుల్లో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్తు వంటి కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపైనా ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించాలని నిర్ణయించింది. అదే తరహాలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫోన్ కాల్స్ కోసం ప్రజలు రెండు మూడు నిమిషాలు కేటాయించి జవాబులు చెబితే ప్రభుత్వం నుంచి మెరుగైన సేవలందించేందుకు సులభంగా ఉంటుందని సిఎం చంద్రబాబు ఇటీవల పేర్కొన్నారు. మంచిపాలనకు, నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ విధానాన్ని విజయవాడ బుడమేరు వరదల సమయంలోనూ, పార్టీ అభ్యర్థుల ఖరారు విధానంలోనూ అమలు చేశారు.

విశాఖ ఉక్కు కోసం

ఇంటింటికీ ఉద్యమం

- పార్లమెంటులో గళం విప్పుతాం
- బిఎస్‌పి ఎంపి రాంజీ గౌతమ్

ప్రజాశక్తి– ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దాన్ని ఇంటింటి ఉద్యమంగా బిఎస్‌పి ఉధృతం చేయబోతోందని ఆ పార్టీ జాతీయ కో–ఆర్డినేటర్, ఎంపి రాంజీ గౌతమ్ తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద బిఎస్‌పి ఆధ్వర్యాన ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక గళాన్ని పార్లమెంటులో వినిపిస్తానని తెలిపారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ, విభజనవాదాన్ని పోషిస్తూ, బిజెపి నిస్సిగ్గుగ్గా 23 ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెట్టిందన్నారు. ఇప్పుడు ఆంధ్రులకు గర్వకారణమైన విశాఖ ఉక్కును అమ్మేస్తోందని విమర్శించారు. అదానీలకు ప్లాంట్ వెళ్లిపోతే పేదలకు కొలువులు, జీవనాధారం ఉండదని తెలిపారు. రూ.4 లక్షల కోట్ల ఉక్కు ఆస్తిని రూ.25 వేల కోట్లకు అమ్మేసి.. రిజర్వేషన్లు, అసలు ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా చేయడమే బిజెపి ఉద్దేశమన్నారు. క్యాప్టివ్ మైన్స్ ఇస్తే ఆరు నెలల్లో లాభాలు చూపే సత్తా విశాఖ ఉక్కుకు ఉందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కోసం నాడు భూములు తీసుకొని నేడు వాటిని ప్రయివేటుపరం చేయడం దారుణమన్నారు. లంచాలు తీసుకొని పార్టీలు నడుపుకుంటూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుకు కట్టబెట్టడాన్ని బిఎస్‌పి వ్యతిరేకిస్తోందని తెలిపారు. తమ ఈ పోరాటానికి లక్నో నుంచి ఎంపి వచ్చారని, కానీ స్థానిక ఎంపీలు కలిసిరాకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాంట్రాక్టను అప్పగించారని తెలిపారు. ఈ అంశంపై కూడా దర్యాప్తు చేపట్టి స్మార్ట్ మీటర్ల ఆర్డర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖలోని డేటా సెంటర్ ముసుగులో మధురవాడలో ధారాదత్తం చేసిన వేల కోట్ల విలువ చేసే 270 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని కోరారు. అదాని కుంభకోణంలో అప్పటి రాజకీయ నేతలకు ఎంత బాధ్యత ఉందో, అంతే బాధ్యత

సెకి ఒప్పందంపై సంకోచమెందుకు?

కేంద్రంలో తమ భాగస్వాములైన ఎన్‌డిఎ ప్రభుత్వానికి కూడా ఉందని గుర్తించాలని సిఎంకు తెలిపారు. అదాని కుంభకోణం సందర్భంగా దేశవ్యాప్తంగా ఒక చట్టబద్ధమైన జ్యుడీషియల్ కమిషన్ ద్వారా అన్ని సోలార్ ప్లాంట్ల విషయంలో సమగ్రమైన దర్యాప్తు జరపాలని కోరారు.

15 ఏళ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వాలు, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు కేంద్రీకృతమైన సోలార్ ప్లాంట్‌లు స్థాపించడానికి విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ ప్లాంట్ల వల్ల వినియోగదారులు నష్టపోతున్నారని వెల్లడించారు.

అజ్మీర్ దర్గాలో సర్వే ఓ సైద్ధాంతిక దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆలయాల ఉనికి గుర్తింపు కోసం హిందూ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న అజ్ఞాన సమూహాలు డిమాండ్ చేస్తున్నాయని, 'ప్రార్థనా స్థలాల చట్టం నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ, కోర్టులు కూడా ఇటువంటి డిమాండ్లపై అనవసరమైన శ్రద్ధ, తొందరపాటుతో స్పందిస్తున్నట్లు కనిపిస్తున్నాయి' అని లేఖలో పేర్కొన్నారు. 'ఉదాహరణకు 12వ శతాబ్దపు మతగురువు యొక్క దర్గాలో సర్వేకు స్థానిక కోర్టు ఆదేశించడం ఊహించలేనిదిగా కనిపిస్తోంది. ఈ దర్గా కేవలం ముస్లింలకు మాత్రమే కాకుండా, బహుళ సంప్రదాయలను అనుసరించే భారతీయులందరికీ పవిత్రమైన సూఫీ క్షేత్రాల్లో ఒకటి' అని లేఖలో పేర్కొన్నారు. 'భారత ఉపఖండంలో ప్రత్యేకమైన సూఫీ లేదా భక్తి ఉద్యమం, కరుణ, సహనం, సామరస్యం అంతర్భాగంగా సాగే ఉద్యమంలో ఆదర్శంగా ఉన్న ఒక సాధువు తన అధికారం కోసం ఆలయాన్ని ధ్వంసం చేసాడనే ఆలోచననే హాస్యాస్పదంగా ఉంది' అని లేఖలో పేర్కొన్నారు. 'ఈ ప్రత్యేకమైన క్షేత్రంపై సైద్ధాంతిక దాడి అనేది మన నాగరికత వారసత్వంపై దాడిగా భావించాలి. మీరు కోరుకుంటున్న సమ్మిళిత భారత దేశ పునర్జీవం యొక్క ఆలోచనను వక్రీకరిస్తుంది' అని మోడికి రాసిన లేఖలో తెలిపారు. ఇలాంటి అవరోధాలతో సమాజం పురోగమించదు లేదా అభివృద్ధి చెందిన భారత్ గురించి మీ కల ఫలించదని మోడీకి స్పష్టం చేశారు. గత 10 ఏళ్ల నుంచి దేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, మైనార్టీలు 'తీవ్రమైన ఆందోళన, అభద్రతాభావం'లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గత 10 ఏళ్లలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అధికార యంత్రాంగం పక్షపాత పాత్రను పోషిస్తున్నాయని స్పష్టంగా కనిపిస్తోందని, గతంలో ఇల జరగలేదని లేఖలో పేర్కొన్నారు. గోమాసం తీసుకెళ్తున్నారనే ఆరోపణలతో ముస్లింలను బెదిరించిన ఘటనలు ఏకంగా వారి ఇళ్లలోనే దాడి చేసి చంపడం వరకూ పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ముస్లింల వ్యాపార సంస్థలను, తినుబండాలను బహిష్కరించాలని, ముస్లింలకు ఇళ్లను, స్థలాలను అద్దెకు ఇవ్వకూడదని పిలుపులు ఎక్కువయ్యాయని, ముస్లింల ఇళ్లపై బుల్డోజింగ్‌కు ముఖ్యమంత్రులే నేతృత్వం వహిస్తున్నారని లేఖలో విమర్శించారు. సమారు 1.54 లక్షల ఉపాధులు ధ్వంసమయ్యాయని, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని, లేదా వారి వ్యాపార స్థలాలను కోల్పోయారని, బాధితుల్లో ఎక్కువ మంది ముస్లింలే అని లేఖలో గుర్తు చేశారు. 'ఇలాంటి ఘటనలు గతంలో జరగలేదు. ఇలాంటి ఘటనలు ఇక్కడి మైనార్టీలనే కాకుండా విదేశాల్లో ఉంటున్న లౌకిక భారతీయుల విశ్వాసాన్ని కదలించింది' అని తెలిపారు. ఇలాంటి ఘటనలకు తోడు మధ్యయుగపు మసీదులు, దర్గాల్లో హిందూ ఆలయాల ఉనికిని గుర్తించడం కోసం సర్వేలను డిమాండ్ చేయడం మైనార్టీలను మరింతగా రెచ్చగొట్టడమేనని అన్నారు. ముఖ్యమంత్రులు, వారి అధికారులు చట్టానికి, రాజ్యాంగానికి కట్టుబడి ఉండేలా చూడాలని ప్రధానమంత్రిని వారు కోరారు. 'ప్రధానమంత్రిగా మీ సమగ్ర భారత్ అందరికి చెందినదిగా ఉండాలని, ఇలాంటి సందేశం ఇవ్వడానికి మీ అధ్యక్షతన తక్షణమే సర్వమత సమావేశం నిర్వహిచాలి' అని లేఖలో డిమాండ్ చేశారు. 'సమయం చాలా విలువైనది. మత సామరస్యం కొనసాగించాలనే సంకల్పం మీ ప్రభుత్వంలో బలంగా ఉందని భారతీయులందరికీ, ముఖ్యంగా మైనార్టీలకు భరోసా ఇవ్వాలని మేం మిమల్ని కోరుకుంటున్నాం' అని లేఖలో పేర్కొన్నారు.

విషాదం

(మొదటి పేజీ తరువాయి)

దూరంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కారు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే అమరేగౌడకు చెందిన ఐఫోన్ ప్రమాద సందేశాన్ని కుటుంబీకులకు తెలిపింది. జిపిఎస్ ఆధారంగా కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో వైద్యులు గోవిందరాజులు, యేగేష్, న్యాయవాది వెంకటనాయుడు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన అమరేగౌడను చికిత్స నిమిత్తం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. డాక్టర్ గోవిందరాజులు బళ్లారి ప్రాంతంలో కేన్సర్ చికిత్సకు, పేదలకు వైద్యం అందించడంలో పేరుగాంచారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి కర్ణాటక విమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ గంగాధర్ గౌడ, సిబ్బంది సంతాపం తెలిపారు.

అదానీ కుంభకోణంపై మోడీ నోరు విప్పాలి

- మోడీ, జగన్, చంద్రబాబులకూ వాటా
- విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి
- సిపిఎం తిరుపతి జిల్లా మహాసభలో వి శ్రీనివాసరావు



సిపిఎం తిరుపతి జిల్లా మహాసభ సందర్భంగా డప్పు కొడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో/శ్రీకాళహస్తి

ప్రపంచాన్ని కుదిపేస్తోన్న సోలార్ విద్యుత్ కుంభకోణంపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ పెదవి విప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అదానీ కుంభకోణంలో మోడీ, జగన్, చంద్రబాబులకు వాటా ఉందని విమర్శించారు. డిసెంబర్ ఒకటి నుంచి ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల మోతకు సిద్ధమవుతున్న టిడిపి కూటమి సర్కార్ దీనిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆదివారం తిరుపతి జిల్లా 14వ మహాసభ ఉత్సాహంగా, ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డబ్బు, కులం, కుటుంబ పాలనలాంటి అంశాలు ఈ రోజుల్లో అధికారాన్ని, నాయకులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను కోరుకుంటున్నారని, భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సోలార్ విద్యుత్ కుంభకోణంలో రూ.1,750 కోట్లు ముట్టాయని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోన్నా మోడీ, చంద్రబాబు ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. తాను మోడీ చెప్పినట్టు చేశానని జగన్... మోడీ చెప్పకుండా తానేమీ చేయలేదని చంద్రబాబు అనడం ద్వారా ఒకరు చెప్పకుండా అదానీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. సోలార్ విద్యుదుత్పత్తి కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు ఎకరాకు రూ.30 వేలు మాత్రమే చెల్లించేలా అదానీ ఒప్పందాలు చేసుకున్నారని, విద్యుదుత్పత్తి ద్వారా నెలకు రూ.5 లక్షల ఆదాయం అదానీకి వస్తుందని వివరించారు. మోడీ పాలనలో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు 8 నుంచి 3 శాతానికి పడిపోయాయని, నిత్యావసర ధరలు మాత్రం 8 నుంచి 16 శాతం పెరిగాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల భజన చేస్తుండడం వల్లే దేశానికి ఈ దుస్థితి పట్టిందన్నారు. స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని పిలుపునిచ్చిన టిడిపి నాయకులు అధికారంలోకి వచ్చాక చేవ సచ్చిందా అని ప్రశ్నించారు. మాజీ ప్రధాని మన్మోహన్ మాటకు విలువలేదని పార్లమెంట్ సాక్షిగా బిజెపి తూలనాడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వనంటూ తెగేసి చెప్పినా టిడిపి కూటమి సర్కారుకు చీమ కుట్టినట్లు కూడా లేదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మెగా డిఎస్‌సిపై చంద్రబాబు చేసిన తొలి సంతకం చెరిగిపోయిందంటూ ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసాలపై ప్రజలు ప్రశ్నించాలని, కమ్యూనిస్టులతో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. చెగువేరా, భగత్ సింగ్ వారసుడినంటూ చెప్పుకున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్... తిరుపతి లడ్డూ వివాదాన్ని సాకుగా చూపి సరికొత్త సనాతన బాబాగా మారారని, ఆయన సమతా వాదా? ఆర్ఎస్ఎస్ వాదా? ప్రజలకు చెప్పాలన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలు చూస్తున్నారని, భవిష్యత్తు వామపక్షాలదేనని పేర్కొన్నారు. ఉమ్మడి పోరాటాల ద్వారా బలమైన రాజకీయ శక్తిగా సిపిఎం రూపుదిద్దుకునేందుకు కర్తవ్య దీక్ష చేపట్టాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.జనార్ధన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య మాట్లాడారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ నాగరాజు, తిరుపతి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మహాసభకు అధ్యక్ష వర్గంగా అంగేరి పుల్లయ్య, జోగి శివకుమార్, ఆర్.లక్ష్మి వ్యవహరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ ప్రారంభోపన్యాసం చేశారు.

బియ్యం స్మగ్లింగ్ డెన్‌గా కాకినాడ పోర్టు

- సి పోర్టులో 41.12 శాతం వాటా అరబిందో ఎలా దక్కించుకుందో తేలాలి
- బియ్యం స్మగ్లింగ్ కోసం దేశ భద్రతను రిస్క్‌లో పెట్టారు
- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో కాకినాడ పోర్టును బియ్యం స్మగ్లింగ్ డెన్‌గా మార్చారని, బియ్యం దందాకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. విజయవాడలోని నోవాటెల్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు బియ్యం మాఫియా నెట్‌వర్క్ పనిచేస్తోందని, రూ.కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టిందని అన్నారు. కార్పొరేట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాకినాడ సి పోర్టు యజమాని కెవి రావు కుటుంబం నుంచి అరబిందో 41.12 శాతం వాటాను ఎలా దక్కించుకుందో తేలాల్సి ఉందన్నారు. జిఎంఆర్ నుంచి కాకినాడ ఎస్ఇజడ్ లాక్కున్నారని, అరబిందో అసలైన యజమాని ఎవరో ప్రజలకు తెలియాలని మంత్రి పేర్కొన్నారు. వైసిపి పాలనలో కాకినాడ పోర్టులోకి ఎవర్నీ అడుగుపెట్టనీయలేదని, మానస సంస్థకు కాకినాడ పోర్టులో ఏడెకరాలు ఎలా కేటాయించారని ఆయన ప్రశ్నించారు. గత మూడేళ్లలో గంగవరం పోర్టు నుంచి 2,20,289 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు నుంచి 23,51,218 మెట్రిక్ టన్నులు, విశాఖ పోర్టు నుంచి 38,02,000 మెట్రిక్ టన్నులు ఎగుమతి జరిగితే ఒక్క కాకినాడ పోర్టు నుంచి 1,31,18,346 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరిగాయన్నారు. వీటి విలువ రూ.48,537 కోట్లు అని అన్నారు.

కాకినాడ పోర్టు నుంచి బియ్యం స్మగ్లింగ్ కోసం దేశ భద్రతను రిస్క్‌లో పెట్టారని మంత్రి విమర్శించారు. మాఫియా వెనుక ఎలాంటి శక్తులు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. వైసిపి హయాంలో కాకినాడ పోర్టులో జరిగిన అక్రమాలపై మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జూన్ 28న కాకినాడలోని 13 గోదాముల్లో తనిఖీలు చేసి 51,247 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని, అందులో పరీక్షల అనంతరం 25,386 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంగా నిర్ధారణ అయ్యిందన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన ప్రత్యేక కమిటీని నియమించి, రేషన్ మాఫియాతో సంబంధం ఉన్న 13 కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఆయా కంపెనీలు హైకోర్టుకు వెళ్లి బియ్యం రిలీజ్ చేయాలని కోరాయన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నాన్ పిడిఎస్ రైస్‌ను ముందుగా రిలీజ్ చేశామని, అనంతరం రూ.84 కోట్ల బ్యాంకు గ్యారెంటీలతో పిడిఎస్ బియ్యాన్ని రిలీజ్ చేశామని తెలిపారు. రాష్ట్రంలో 29 వేల రేషన్ డిపోలు ఉన్నాయని, వైసిపి ప్రభుత్వంలోని పెద్దల స్వలాభం కోసం రూ.1,600 కోట్లు ఖర్చుపెట్టి రేషన్ డోర్ డెలివరీ పేరుతో 9360 ఎండియు వాహనాలు కొనుగోలు చేశారన్నారు. ఈ వ్యాన్ల ద్వారా పెద్దయెత్తున రేషన్ బియ్యం తరలించారని మంత్రి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నేడు, రేపు ధర్నాలు
- ఎపి రైతు, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని, తేమ శాతం 25 శాతం ఉన్నా ప్రతి గింజ కొంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ఎపి రైతు, ఎపి కౌలు రైతు సంఘం విమర్శించింది. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. తుపాను ప్రభావంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేక అమ్మేందుకు సిద్ధపడితే తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉందని కొనుగోలు కేంద్రాల దగ్గర ప్రభుత్వ సిబ్బంది... రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 2, 3 తేదీల్లో గ్రామ, మండల కేంద్రాల్లో రైతులు, కౌలు రైతులు ముందుకొచ్చి ధర్నాలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలని వారు కోరారు.

అదానీ కుంభకోణంలో

చంద్రబాబు, పవన్ కూడా దోషులే..

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు
- ముగిసిన పార్టీ బాపట్ల జిల్లా మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-బాపట్ల

అదానీ కుంభకోణంలో వైసిపి అధినేత జగన్‌తోపాటు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కూడా దోషులేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. కార్పొరేట్ కుంభకోణంలో వీరంతా ఒక తానులో ముక్కలేనని తెలిపారు. బాపట్లలోని సీతారాం ఏచూరి నగర్ (ఎంఎస్ఆర్ కల్యాణ మండపం)లో జరిగిన రెండు రోజులుగా జరిగిన సిపిఎం బాపట్ల జిల్లా మొదటి మహాసభలో ఆదివారం ఆయన ముగింపు ఉపన్యాసం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలపై పేదలందరినీ సమీకరించి పోరాటాలు చేసిన చరిత్ర బాపట్ల ప్రాంత కమ్యూనిస్టు యోధులకు ఉందన్నారు. ప్రపంచంలోనే అనేక దేశాల్లో బూర్జువా పార్టీలు ఎన్నికలను అప్రతిష్టపాలు చేస్తున్నాయని, పెట్టుబడిదారీ దేశాలు వాటి విధానాలు, మౌలిక సమస్యల పరిష్కారానికి మార్గం చూపలేకపోతున్నాయని పేర్కొన్నారు. శ్రీలంక, ఫ్రాన్స్, నేపాల్‌లో ప్రజల పక్షాన నిలబడి పోరాడిన వామపక్ష పార్టీలు విజయం సాధించాయని తెలిపారు. ఎన్నికల్లో ఓట్లు, సీట్లు తగ్గినా.. దేశ ప్రజల మనసుల్లో మాత్రం సిపిఎంకు సుస్థిర స్థానం ఉందని అనేక సందర్భాల్లో నిరూపణ అయిందన్నారు. మోడీ అవినీతికి వ్యతిరేకంగా నిలబడి మాట్లాడుతోంది సిపిఎం ఒక్కటేనని తెలిపారు. ఒకప్పుడు గ్రామాల్లో పెత్తందారులు ఉండేవాళ్లని.. ఇప్పుడు అదే గ్రామాల్లో ధనిక వర్గం ఏర్పడిందన్నారు. ఈ వర్గం అన్ని రంగాలనూ ఆక్రమించి దోపిడీని ముమ్మరం చేసిందని తెలిపారు. ధనిక వర్గం చేసే అక్రమాలను, దోపిడీని ఎదుర్కోవాలని, అది సిపిఎంతోనే సాధ్యమని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి మాట్లాడుతూ ప్రజా సమస్యలు మన సమస్యలుగా భావించి.. వాటి పరిష్కారం దిశగా పోరాడాలని సూచించారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపారన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై ఉద్యమించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నిరంతర పోరాటాలతో దీర్ఘకాలిక సమస్యలు సైతం పరిష్కారమవుతాయని తెలిపారు. తొలుత సిపిఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. సభకు అధ్యక్ష వర్గంగా సిహెచ్.మజుందార్, ఎం.ఆంజనేయులు, ఝాన్సీ వ్యవహరించారు.

కార్యదర్శిగా గంగయ్య



మహాసభ సందర్భంగా 14 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శిగా సిహెచ్.గంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా టి.కృష్ణమోహన్, సిహెచ్.మజుందార్, ఎన్. బాబూరావు, సిహెచ్.మణిలాల్ ఎన్నికయ్యారు.

మరో పోరాటానికి సిద్ధం కావాలి

- ఎస్ఎస్ఎ జెఎసి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కాకినాడ

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ హక్కులను కాపాడుకోవడం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎస్ఎస్ఎ జెఎసి పిలుపునిచ్చింది. ఎపి సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో కాకినాడలోని టీచర్స్ హోమ్‌లో ఆదివారం సమావేశం జరిగింది. జెఎసి జిల్లా ఛైర్మన్ చంటిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెఎసి రాష్ట్ర ఛైర్మన్ కాంతారావు, అధ్యక్షుడు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వంతో జరిగిన సమ్మె ఒప్పందం మేరకు జిఒలు, సర్క్యులర్లు, హెచ్ఆర్ పాలసీ, మినిమం టైమ్ స్కేల్‌పై తక్షణమే కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో ఒప్పందం జరిగి 11 నెలలు గడుస్తున్నా ఒప్పందంలో అనేక అంశాలపై అధికారిక ఉత్తర్వులు విడుదల కాలేదని తెలిపారు. నిత్యావసరాల ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగి కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందన్నారు. మరోవైపు డ్యూటీ సమయం లేకుండా సాయంత్రం 5 గంటల తరువాత జూమ్ మీటింగులు పెట్టి వ్యక్తిగత సమయాన్ని కూడా హరిస్తున్నారని వివరించారు. లక్ష్యాలను నిర్దేశిస్తూ మహిళా ఉద్యోగులతో కూడా రాత్రి వరకు పనిచేయిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులను బానిసలకంటే దారుణంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాడటానికి సిద్ధపడాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, కోశాధికారి పి.రాజు, ఐఇఆర్‌టి జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, నాగార్జున, పార్ట్ టైమ్ ఉద్యోగుల నాయకులు మహాలక్ష్మి, గంగాధర్, పాల్గొన్నారు.

ఆధిపత్యపోరే కారణం

- హిజ్రా హత్య కేసులో 12 మంది అరెస్టు
- పరారీలో ప్రధాన సూత్రదారులు

ప్రజాశక్తి-నెల్లూరు

హిజ్రా దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హిజ్రా నాయకులు హాసిని, అలేఖ్యల మధ్య ఆధిపత్య పోరే హత్యకు కారణమని ఎస్‌పి జి కృష్ణకాంత్ తెలిపారు. హత్యలో పాల్గొన్న 12 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు వివరాలను ఎస్‌పి కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న మానికల హాసిని (ట్రాన్స్‌జెండర్) హత్యకు గురయ్యారు. నెల్లూరు జిల్లా విడవలూరు మండలం పార్లపల్లిలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న హాసినిని రాత్రి 10 గంటల సమయంలో టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రెండు కార్లలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి కత్తులతో దాడి చేసి హత్య చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య, రూరల్ డిఎస్‌పి జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కొడవలూరు సిఐ ఎ.సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. కోవూరు అండర్ బ్రిడ్జి వద్ద రెండు కార్లలో వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయాలు వెలుగు చూశాయి. హాసినికి సులోచన, షిలా, అలేఖ్య అనే హిజ్రాలతో విభేదాలు ఉన్నాయి. దీంతో సులోచన, షిలా, అలేఖ్యలు కలిసి మరికొందరి సాయంతో హాసినిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో హత్య చేశారు. హత్యలో ఇల్లపు వంశీకృష్ణ (నాని), మొలతటి రాము, తాండ్ర కార్తీక్, అంబూరు సుబ్రహ్మణ్యం, షేక్ మస్తాన్ వలి, కొత్తపాటి వెంకటాద్రి, కొత్తపల్లి రాజేష్, గురునాధం నరసింహం, నెల్లూరి వంశి, ఊటుకూరి శీల (శ్రీనివాసులు), రాసపనేని అలేఖ్య (అనీల్‌కుమార్), చింతల భూపతి పాల్గొన్నారు. వీరంతా నెల్లూరు జిల్లాకు చెందిన పాత నేరస్తులని ఎస్‌పి కృష్ణకాంత్ తెలిపారు. హత్యలో ప్రధాన సూత్రధారులైన అలేఖ్య, సులోచన, షీలా పరారీలో ఉన్నారని చెప్పారు.

వచ్చుండాయి పీలింగ్స్...



- పుష్ప-2 నుంచి మరో పాట విడుదల

హైదరాబాద్ : అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటించిన 'పుష్ప-2' సినిమా ఈ నెల 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే విడుదలైన అందులోని 'సూసేకి', 'కిస్సిక్' పాటలు సందడి చేస్తున్నాయి. ఇప్పుడు మరో పాట రిలీజైంది. 'పీలింగ్స్' అంటూ సాగే ఈ పాట మలయాళం లిరిక్స్‌తో ప్రారంభమైంది. మలయాళ అభిమానులపై ప్రేమతో ఇలా క్రియేట్ చేశామని అల్లు అర్జున్ ఓ ఈవెంట్‌లో తెలిపారు. ఈ మేరకు చిత్రబృందం ఆదివారం పాటను విడుదల చేసింది.



"సామాజిక జీవితం లేకపోతే
సాహిత్యం అనేదే సాధ్యం కాదు.
ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే
సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే
రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది.

– మహాకవి శ్రీశ్రీ

సెనైల్ డిమెన్షియా

నా పచ్చని కలల చిత్రం మీద
నువ్వు అడ్డదిడ్డంగా కొన్ని గీతలు గీసి
అభివృద్ధి అని చదువుకోమంటావు

నువ్వు వెలుగు అని చూపిస్తున్న వైపు
నా కళ్ళకి చీకటే కనిపిస్తుంటుంది
నీ నీడను చూసినా
వల పన్ని రిలాక్స్‌గా గట్టున కూర్చున్న
వేటగాడే గుర్తొస్తాడు
నీది విధ్వంస లిపి
నా చెమట లిపి నీకు ఎప్పటికీ అర్థం కాదు
నా పిడికిళ్ళు నీకు
పరిహారపు పెంపు నినాదాల్లా అనిపిస్తాయి

నీవన్నీ అల్జీమర్స్ కాంప్లికేషన్స్
నీ ఓటమిని తెలిగ్గా మర్చిపోయి
కొత్త కుట్రగా నిన్ను నువ్వు అప్డేట్ చేసుకుంటావు

నేనైతే ఏమీ మారను
మట్టి నా దివారాత్రుల స్వప్నం
నేల నా బొడ్డు తాడు
తెగ్గోసుకుపోతూ వుంటే చూస్తూ ఊరుకోను

నువ్వు చైతన్య సదస్సులు పెడతావు
నేను నీ మాటల వెనుక కుట్రల్ని ఎండగడతాను
నువ్వు వేళ్ళను నరికేయాలని చూస్తావు
నేను మొండి చేతులతో తిరగబడతాను
నువ్వు ఖాకీలతో వస్తావు
నేను నా యుగయుగాల పొద్దురంగు చొక్కా దులిపి వేసుకొస్తాను
ఆఖరికి నువ్వు నీ తూటాల మీద నమ్మకం పెడతావు
నాకు ఆప్షన్ ఉండదు
నా ప్రాణంతో బదులిస్తాను!

– సాంబమూర్తి లండ,
96427 32008

గ (పె)ద్దల రెక్కల చప్పుడు

పచ్చని హరితవనం
అక్కడ రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి
సున్నం పిండి లాంటి ఇసుక దిబ్బలు
వాటి మీద ముగ్గులేసినట్టు చక్కటి జీడి మామిడి
వాటి మధ్య అక్కడక్కడ
పనస మునగా అరటి పొదలు
మనుషులతో పాటు
ఎన్నో జంతు జీవరాసులకు ఆవాసాలు, అనుకూలాలు
ఆ పక్కనే ఎగిసిపడిన సంద్రం
ఆటుపోటుల మధ్య ఈతి బాధలు
ఇప్పటికే ఎండిన జీడిపిక్కలు లాగే
కాటికి కాలుచాపుతున్న మూత్ర పిండాలు, గండాలు
పుండు మీద కారంపొడిలా వాలిపోతున్నారు
గద్దల్లా పొడవ ముక్కు పెద్దలు

ఇప్పుడు ఉద్దానం వణికిపోతోంది
గద్దె మీద పెద్దల్లారా
ఇప్పుడు ఉద్దానం ఒంటరి కాదు
ఉద్యమాల గెడ్డ మీదకి
విమానాలు వస్తాయంటే ఊరుకోరు
తరిమి తరిమి కొడతారు
సోంపేట బీలను చూడండి
కాకరాపల్లి కదనం కనపడలేదా?
మా చేతులు కలిస్తే
మీ చేతులు బలాదూర్!

– నిశితాసి

దిక్కులు ఎర్రబడుతుంటే..

యుద్ధం మొదలుపెట్టిన చోటే
తిరిగి ప్రారంభమైంది
అక్కడ.. క్షణాలు దిగులుగా
నిట్టూర్పులు రోదనలుగా మారి
విషాదం కళ్ళ లోంచి
భయ ప్రకంపనల్ని పుట్టిస్తున్నాయి

ఇప్పుడక్కడ ఎవరు చెవిపెట్టి ఆనించినా
అలసిన గుండెల్లో ప్రతిధ్వనించేవి
భీకర వైమానిక దాడులే!
చూపును కదిపి చూస్తే
కాలం కూడా యుద్ధం చేస్తోంది
పేలుతున్న క్షణాల మధ్య
పాలస్తీనా ఇప్పుడు ఓ మండుతున్న అగ్నిగోళం
ఓటమికి తల వొంచి
ఉప్పొంగుతున్న రక్తపు మడుగుల్లో
చరిత్ర పాత కథనే తిరగ రాస్తోంది!
ప్రాంతం ఎవరిదైనా
దురాక్రమణ మాత్రం దౌర్జన్యంగా మారింది
నెపం ఎవరి మీదకు నెట్టాలో తెలీడం లేదు
క్షతగాత్రుల సమూహాలూ
కంపు కొడుతున్న మృతకళేబరాలూ
దాడి పేరుతో రోజుకొక విధ్వంసాన్ని సృష్టిస్తుంటే,
చీకటి బతుకుల మీద విధి
సరికొత్త తలరాతల్ని రాస్తోంది!

మనిషి ప్రాణానికి మానానికి
విలువలేని ఈ లోకంలో
మరణానికి గుర్తింపు ఎక్కడుంది?
పసికందులైనా మహిళలైనా
హత్యలైనా అత్యాచారాలైనా
యాంత్రిక దృశ్యంలోంచి
అక్కడ ఓ నిత్యకృత్యమైపోయింది
మాదక ద్రవ్యాల నిషాలో తూలి తేలుతున్న యువత
మత్తుకు బానిసల్ని చేస్తూ ఛిద్రమౌతున్న భవిత
మనసు కరిగి నీరై వరదై
కంటి తుడుపుగా మారిపోయింది

గాజా
పాలస్తీనాలో ఓ అంతర్భాగం
సజీవ నెత్తుటి ప్రతిబింబం
నాటో అమెరికాలతో
శవ రాజకీయం చేస్తున్న మూల శక్తుల్ని అడగాలి
పాలస్తీనా లెబనాన్ జోర్డాన్ సిరియా
దేశమేదైతేనేం?
అప్పటికీ ఇప్పటికీ చరిత్ర ముఖచిత్రం ఒకటే!
నేలపై ఆధిపత్యం భూ స్థావరాల్ని
భస్మీపటలం చేస్తుంటే,
వర్తమానంలోంచి చరిత్ర వలసపోతోంది
స్వేచ్ఛలేని పీడ కలల మధ్య
భవిష్యత్తు ముఖచిత్రం
క్షణక్షణానికీ మారిపోతుంటే,
విస్తుపోయి చూస్తున్న లోకం
భయం భయంగా కాలాన్ని వెళ్ళదీస్తోంది
రెప్పల ఊటలోంచి
నెత్తుటి తడి ఆరని దృశ్యం
దిష్టిబొమ్మలా చోద్యం చూస్తూ
ప్రత్యక్ష మౌనసాక్షిగా
నిలిచిపోయింది కాలం!

– మానాపురం రాజా చంద్రశేఖర్
77940 39813

ప్రేమ, ప్రతిఘటనల
మేలు కలయిక

వేంపల్లె షరీఫ్ ... 'జుమ్మా', 'టోపి జబ్బార్' కథా సంకలనాల ద్వారా తెలుగు కథా సాహిత్యంలో అటు సమాజంలో కూడా తన అస్తిత్వాన్ని, అందులో తన ప్రత్యేకతను ముద్రించుకున్నాడు. ఒక మైనారిటీగా తన అస్తిత్వ వేదనను, తన జాతి అనుభవిస్తున్న వివక్షను గురించి రాయటంతో పాటు, వాటిపట్ల పాఠకులను సెన్సిటైజ్ చేస్తూ స్నేహ సామరస్యాల గురించి కూడా రాస్తున్నాడు. షరీఫ్ తాజా కథా సంపుటి 'చారలపిల్లి'లో 'బడే పీర్', 'బాబయ్య స్వామి దర్గా' కథలు చదువుతుంటే నాకు చాలా దు:ఖం వచ్చింది. ప్రేమ్‌చంద్ కథలో తన అమ్మమ్మ కష్టం చూడలేక, రోజా ఆమె రొట్టెలు కాలుస్తూ చేతులు కాల్చుకుంటే చూడలేని చిన్ని మనుమడు హమీద్– ఈద్గా పండుగ రోజు ఈద్గాకు వెళ్ళి, తన వద్దనున్న మూడు పైసలతో తనకేమీ కొనుక్కోకుండా అమ్మమ్మకు చిమ్టా తెచ్చి ఇస్తాడు. అమ్మమ్మ ఆనంద బాష్పాలతో తడిసి ముద్దవుతుంది. ఇక్కడ 'బడే పీర్' పండుగ రోజున అప్పటికే మరణించిన అమ్మమ్మ కోసం షరీఫ్ ఒక వెండి కుందు కొనుక్కు వెళ్ళి దానిని వెలిగిస్తాడు. ప్రేమ్‌చంద్ కథ ఒక పేద కుటుంబపు భౌతిక ఆర్థిక అవసరాన్ని అర్థం చేసుకున్న చిన్న పిల్లవాడి మనసు చూపి మన కళ్ళలో నీరు నింపితే, షరీఫ్ ఒక పేద కుటుంబపు ఆధ్యాత్మిక అవసరాన్ని గురించి రాసి మన మనసులను తడితో నింపుతాడు. ఈ కథల్లో సామాన్య ప్రజల జీవితం ముఖ్యమైనది. దానిని అమానుషంగా మార్చిన ద్వేషశక్తుల నుంచి ఎలా విముక్తి చేయాలి? ఎలా మానవీయం, ప్రేమ పూరితం చేయాలి? అనే ప్రశ్నను షరీఫ్ కథలు వేస్తున్నాయని ఈ సంకలనంలోని కొన్ని కథలు చదివినప్పుడు నాకు అనిపించింది.

'బాబయ్య స్వామి దర్గా' కథలో బాబయ్య స్వామి అక్కడికి వచ్చి ఉండి వెళ్లాడా? అది నమ్మకమా? అనే ప్రశ్నల్లోకి వెళితే ఆ కథను అర్థం చేసుకోలేము. దర్గాల సంస్కృతికి, అస్లీ ఇస్లాంకు మధ్య పెరుగుతున్న వైషమ్యాలను, దానివల్ల రాబోయే ప్రమాదాలను గమనిస్తే మనకు అర్థం అవుతుంది. వలీ నిజాయితీ, దర్గా భారం నిర్వహించక తప్పని పరిస్థితిలో సూరయ్య ఒక ఆశాదీపం. అతనికి అస్లీ ఇస్లాం తెలియదు, అస్లీ హిందుత్వం తెలియదు – తన జీవితం బాబయ్య స్వామి వల్ల బాగు పడిందనే నమ్మకం తప్ప. ఈ నమ్మకాలను హేతువాద తర్కంతో చూస్తే అర్థరహితమే కానీ చరిత్రలో ఈ నమ్మకాల వల్ల ప్రజల్లో విద్వేషాలు శృతి మించలేదు అనేంతవరకే షరీఫ్ ఆశించిన కథా ప్రయోజనం.

శాంతి కపోతాలు ఎక్కడకు వెళ్ళినా హింస బారిన పడతాయి. హింసను ఎంత దూరానికి తరిమినా అది తిరిగి వస్తుంది. ఏమిటి పరిష్కారం? పావురాలను పెంచడమే, ఒక గూటిలో చేర్చడమే సమస్యా? వాటికి ఎగిరే స్వేచ్ఛ లేకపోవడమే ప్రాణాంతకమైందా? హింస కోపాన్ని, ద్వేషాన్ని ప్రేరేపిస్తుంది. కానీ హింసకు హింస సమాధానం కాదు – అది అందరికీ తెలుసు. 'చారల పిల్లి' దేనికి సంకేతమో తెలుసుకోగలిగితే షరీఫ్ కథా ప్రయోజనం నెరవేరినట్లే.


జండర్‌ని మతం కంట్రోల్ చేయబూనుకునే సందర్భాన్ని 'పత్తిగింజలు' కథలో మనం చూడవచ్చు. ఒక అర్థంలేని మత వివాదంలో ప్యారీ పేరు బైటికి వస్తుంది. ప్యారీ భర్త కువైట్‌పోయి, అక్కడున్న పెళ్ళాంతో బతుకుతుంటే, ప్యారీ జీవితంలోకి ఒక హిందూ కుర్రాడు ప్రవేశించాడు. మసీదు, గుడి వివాదం రాకముందు ఆ సంబంధాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఆ వివాదం రాగానే ఆ వీధిలో ముస్లింల పరువు తీయటానికి, ఆ మతం సక్రమంగా నడవటం లేదని నిరూపించటానికీ ప్యారీ జీవితమే కనిపించింది. తమ మతానికి చెందిన స్త్రీ 'ప్రవర్తన' సక్రమంగా లేదని అవతలి పక్షం ఆరోపిస్తే, మరి మీ వాడి సంగతేమిటి అని అడిగే ముందు ఈ స్త్రీని నిలదీస్తారు. అప్పటిదాకా అటువున్న కోపం ఇప్పుడు మహిళ మీదకు తిరుగుతుంది. ఈమె మతానికి 'మచ్చ'యిపోతుంది. చరిత్రలో ఎందరో స్త్రీల శరీరాలు ఈ జాతి, మత, పరిరక్షణ కోసం బలిపెట్టబడ్డాయి. మతాల మధ్య యుద్ధాలెన్నింటికో స్త్రీల శరీరాలే యుద్ధ ప్రాంతాలయ్యాయి. ఆ సందర్భాన్ని ఈ కథగా మలిచి ఈ మత విద్వేషాలలో ప్రేమ ఎలా నలిగిపోతుందో చూడమనే ఒక సున్నితమైన ముగింపునిస్తాడు రచయిత. ద్వంద్వ నీతిని ప్రశ్నించి ప్రతిఘటించింది ప్యారీ. అది ఒక రాజకీయ చర్య. ప్యారీ తీసుకున్న నిర్ణయం 'నేను యాడికీ పోను, ఈణ్నే ఉంటా. ఈ ఇంటి మీదికి ఎవరొచ్చారో రమ్మను ధైర్నముంటే.. ఒక్కొక్కరి సంగతి జెప్తా..'– ఇవి మామూలు మాటలు కావు. చాలా చిన్న కథలా అనిపించే ఈ కథ నిజానికి చాలా పెద్ద కథకు నాంది కాబోతోందని సూచన మనకు ముగింపులో కనిపిస్తుంది.

'సైకిల్ చక్రాలు', 'హలాల్', 'నల్లబండ' కథలు ఎంత ఎడారిలోనైనా ఒయాసిస్సులుంటాయనే నమ్మకాన్ని కలిగిస్తాయి. మనుషులు మంచివాళ్లే అనే నమ్మకాన్ని పోగొట్టుకుంటున్న కాలంలో తిరిగి ఆ నమ్మకాన్ని కలిగించే కథలు. 'మనిషికి తాను ఎలాంటివాడో అనే దాన్ని తెలియజెపితే మనిషి మెరుగుపడతాడు' అంటాడు ఆంటోన్ చెఖోవ్. మానవులను మరింత మెరుగుపరచాలనీ, మానవీయతతో నింపాలనీ షరీఫ్ కథలు రాస్తున్నాడు. మన నిత్య జీవితంలో, మన భౌతికావసరాల కోసం ఒకరి పట్ల ఒకరు సహనంతో, ప్రేమతో ఉండవలసిన అవసరం ఉంది. ఆ అవసరాన్ని గుర్తించడమే స్వేచ్ఛ. ఆ అవసరాలను పణంగా పెట్టి అసహనంలోకి, ద్వేషంలోకి జారిపోతే ప్రాణ వాయువైన స్వేచ్ఛను కోల్పోతాం అని చెబుతుంది 'సైకిల్ చక్రాలు' కథ. అప్పుడప్పుడు భయం కొలిపే చప్పుళ్ల చేసినా మానవ సహకార సంగీతం నిత్య జీవితంలో భాగమై, అవసరమై హాయిగా వినిపిస్తూనే ఉంటుంది, ఈ కథలోని ఊరి ప్రజల జీవన విధానం వలే. స్నేహం, ప్రేమలే సంప్రదాయాలైతే, మనిషిని మనిషి ప్రేమించుకోవటం, స్నేహించుకోవటమే ఆచారాలైతే, జీవితం ఎంత తేలికవుతుందో చెబుతుంది 'హలాల్' కథ. చేసిన సాయానికి ప్రతిఫలం ఆశించని మనుషులున్నారని నమ్మకంగా చెబుతున్నాడు రచయిత 'నల్లబండ' కథలో. అది కుతూహలాన్ని రేకెత్తించే సెంటిమెంటల్ కథలా కనిపిస్తుంది కానీ గొప్ప విలువను ఎత్తి చూపుతుంది. 'షేర్ని' ... భాషకు జీవితంలోని ప్రతి పార్శ్వంలో ఉండే ప్రాధాన్యత గురించిన కథ. మన భాషలో మన గోస పరాయి భాష వారికి అర్థం కాకపోతే అదొక ఓదార్పు. ఒక మానవ మనస్తత్వాన్నీ, భాషనూ కలిపి అల్లిన కథ. 'నీలం రాయి ఉంగరం', 'గందా ఖూన్' కథలు కూడా మానవ స్వభావపు లోతులను తరచి చూసే కథలు. 'అన్ షెడ్యూల్డ్', 'మట్కా' కథలు ఈ లోకపు ఒత్తిడిని, అన్యాయాన్ని మనకు గుచ్చుకునేలా చేస్తాయి.


ఈ కథల సంకలనం నన్ను ఆలోచింపజేసింది. స్పందించేలా చేసింది. సహానుభూతి నుంచి మమేకత్వానికి తీసుకుపోయింది. ఆ రెండింటి మధ్యా చేసే ప్రయాణం చాలా మానవీయమూ, ప్రేమమయమూ అని చెప్పింది. 'అస్లీ' మైకంలో సామరస్య సంస్కృతిని నిర్లక్ష్యం చేయకూడదని చెప్పింది. ఈ సంకలనం ఈనాటి అవసరం.

(ఇది 'చారలపిల్లి' కథాసంపుటి ముందుమాటకు సంక్షిప్తరూపం)

– ఓల్గా



సంప్రదాయంలో ఆధునికతా దీపం



సంప్రదాయం – ఆధునికం భిన్న ధ్రువాలు. రెండింటిలోని మంచిని గ్రహించి, పాలను నీళ్లను వేరుచేసే హంసలాంటి వారు కొందరుంటారు. అలాంటి వారిలో ప్రథమగణ్యులు సన్నిధానం నరసింహశర్మ గారు. సన్నిధానం వారి గురుమిత్ర పరివారం చూస్తే ఆయన వ్యక్తిత్వం ఏమిటో మనకు ఇట్టే తెలిసిపోతుంది. నేదునూరి గంగాధరం, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, మల్లంపల్లి శరభయ్య, చేబ్రోలు చిన్మయానంద కవి, ఆరుద్ర, చలసాని ప్రసాద్, జయధీర్ తిరుమలరావు, సతీష్ చందర్ ... మరికొందరు. ఇందులో కొందరు ఆయనకు గురుస్థానీయులు, ఇంకొందరు మిత్ర సన్నిభులు. ఇందులో పరమ సంప్రదాయవాదులున్నారు. వామపక్షీయులు న్నారు. దళితులూ వున్నారు. ఇందరితో ఏకకాలంలో సాన్నిహిత్యం నెరపడం మామూలు విషయం కాదు. అది సన్నిధానం లాంటి సహృదయులకే చెల్లు. సన్నిధానంగారికి అభిమాన విషయాలు చాలా వున్నప్పటికీ నాలుగు అంశాలు ఆయనకు ప్రాణపదం అని నేను అనుకుంటాను. ఒకటి : తాను పుట్టి పెరిగిన రాజమహేంద్రవరం, రెండు : గోదావరి నది, మూడు : గ్రంథాలయ పాలన, నాలుగు : కాటన్, బ్రౌన్ దొరలు.

తెలుగు వారి సాహిత్య రాజధాని, తను పుట్టిన ఊరు రాజమహేంద్రవరం అంటే సన్నిధానం గారికి కంఠదఘ్నమైన ప్రేమ. 'నా రాణ్మహేంద్ర నగరమా' అనే 11 పేజీల దీర్ఘ గేయంలో 'వెన్నెలతో మొదలుపెట్టి / వెన్నెలతో తుదిచేసిన / నన్నయ కవిభారతప్ర/ సన్న కథ కవితార్థాయుక్తికి/ నిలయమైన నగరమా / నిర్మల సాహిత్యాకాశమా!' అని పరవశ గానం చేశారాయన. ఈ గేయంలో రాజమండ్రి సాహిత్య సాంస్కృతిక సంస్థల చరిత్రను కొండను అద్దంలో చూపించిన విధంగా చూపించారు. రెండోది గోదావరి నది మీద అమితమైన ప్రేమ ఆయన పద్యాల్లో, వ్యాసాల్లో ద్యోతకమవుతుంది. 'ప్రమేయ ఝరి' వ్యాస సంకలనంలో గోదావరి మీద కవులు రాసిన కవిత్వాలను 'తల్లి గోదారిపై ఎల్లెడా కవితా ప్రవాహాలు', 'కవితాదాహం తీర్చే గోదావరి' పేరుతో రెండు వ్యాసాలు రాసారు. జానపద కవులనుండి, పద్య ప్రబంధకవుల మీదుగా ఆధునిక వచన కవులు గోదావరిని ఎలా ఆవాహన చేసుకొన్నారో గొప్ప పారవశ్యంతో వివరించారు.

మూడోది గ్రంథాలయ పాలన. ప్రవృత్తి – వృత్తి ఒకటే కావడం సన్నిధానం గారికి కలిసొచ్చిన అంశం. ఆయన జీవిక కోసం ఆ ఉద్యోగం చేసానని చెప్పుకున్నా, విశ్వనాథ వారు అన్నట్టు జీవుని వేదనను సంతృప్తిపరచడానికి ఆ ఉద్యోగం దోహదం చేసిందని భావించొచ్చు. సన్నిధానం వారి పేరు గౌతమీ గ్రంథాలయం పర్యాయపదాలుగా మారిపోయాయి నాలుగు దశాబ్దాలుగా. నాలుగోది కాటన్, బ్రౌన్‌లపై ఇష్టం. ఆంధ్ర దేశ సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, ఆర్థిక జీవన పరిస్థితులపై విశేష ప్రభావం నెరపిన వ్యక్తి సర్ ఆర్థర్ కాటన్. "ఆహారమునకు కాటన్/ వ్యాహారమునకు బ్రౌన్" అనే లోకోక్తి కాటన్ దొర గొప్పదనాన్ని సూచిస్తుంది. ఆయన గురించి 'మహాభాగ్యం' అనే గేయంలో "కరువు తీరగ కడుపుదారపు / తెరవు చూపగ తెల్గు వారికి / తరతరాల భిక్షపెట్టిన / ధన్యుదెవడు? కాటనేరా... అంటూ ప్రస్తుతించారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగల గౌతమీ నదీ జలాలు సముద్రంలో కలిసి వృథా అవుతున్నాయని ఆవేదన చెంది కాటన్ శిల్పించిన అద్భుత కట్టడం ధవళేశ్వరం బ్యారేజీ. ఆ విషయాన్ని "తీపి గౌతమి నీరు కూడా/ తీరుతాకను కడలితోడను/ కలిసి నిష్ఫలమగుట నడ్డిన / కాటనంటే ఆనకట్టే / కరువుకింకను ఆనకట్టే" అన్న మాటలు కేవలం కవివే కాదు; ఒక జాతి కృతజ్ఞతా పూర్వక హృదయాంజలులు! శిథిలావస్థలో ఉన్న అనేక తెలుగు కావ్య, ప్రబంధాలను ఉద్ధరించి, పునరుజ్జీవింపచేసి తెలుగునాట సాహిత్య కేదారాలను పండించిన సాహిత్య కృషీవలుడు సిపి బ్రౌన్. ఆయన పేరును తన ఇంటికి 'బ్రౌను మందిరం' అని పేరు పెట్టుకోవడంలోనే సన్నిధానం గారి ఆత్మీయ స్పర్శ మనకు తెలుస్తుంది. బ్రౌను సాహితీ మూర్తిమత్వాన్ని మనకు పటం కట్టి చూపించడానికి ఆయనొక కావ్యమే రాశారు.

అలాగే, తెలుగులో లేఖా సాహిత్యానికి సన్నిధానం వారి దోహదం కూడా కొంత వుంది. ముఖ్యంగా 'మధుస్మృతి' పేరుతో కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారికి అనాటి ఉద్దండ పండితులైన కవులు రాసిన లేఖలను సంపాదించి సంకలనం చేసారు. వేటూరి ప్రభాకరశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ వంటి వారు రాసిన లేఖల్లో మధునాపంతుల సాహితీ వ్యక్తిత్వం ద్యోతకమౌతుంది. అలాగే, ఆనాటి కవిత్వ, పత్రికల స్థితిగతులు తెలుసుకోవడానికి మధు స్మృతి ఎంతగానో ఉపకరిస్తుంది. ఆరుద్ర, చలసాని గార్ల నుంచి సన్నిధానం గారు అందుకున్న లేఖల్లో కూడా బోలెడు ఆసక్తికర సన్నివేశాలు తారసపడతాయి.

తెలుగులో దళిత స్త్రీవాదాలు ఉవ్వెత్తిన ఎగిసి పడ్డప్పుడు సన్నిధానం వారు దళిత కవిత్వంతో కరచాలనం చెయ్యడమే కాదు; గుండెల నిండుగా ఆహ్వానించారు. అందుకు ఆయన ప్రాణహితలో రాసిన 'పట్టాభిషేకం' కవిత తార్కాణం. "స్తవాలకు కాలం చెల్లింది / వాస్తవాలకు కాలం మళ్లింది/ సమానత్వ మానవత్వ రాహిత్యానికి/ సింహాసనంపై నసేమిరా చోటులేదు/ ఇప్పుడు కావాలిసింది/ పాదుకా పట్టాభిషేకం కాదు / చెప్పుల కుట్టే శ్రమజాతికి పట్టాభిషేకం". ఈ వాక్యాలు చాలు శర్మ గారి సంస్కర్త హృదయాన్ని చూడడానికి. బహుశా సన్నిధానం గారిలోని ఈ మానవీయ కోణం నచ్చే అనుకుంటాను సన్నిధానం మిత్రుడు, ప్రముఖ దళిత కవి సతీష్ చందర్ "బాధల బస్తీలో/ ఇరుకిరుకు పిరికి వీధులు/ పల్లెటూరు వాణ్ణి చేసి/ గెలిచిస్తున్నప్పుడు మా సన్నిధానం/ మా ఇంటి వాతావరణం" అని రాయిగలిగాడు పంచమ వేదంలో! ఈ వాక్యాలు సన్నిధానం వ్యక్తిత్వానికి పట్టిన కవిత్వపు గొడుగు. 1991 సెప్టెంబరు చివరివారంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో ఉద్యోగంలో చేరాను. 1992 చివర్లో రాజమండ్రి బొమ్మూరు సాహిత్య పీఠానికి వచ్చాను. రాజమండ్రి సాహితీ మిత్రులందరితో పాటు సన్నిధానం గారు కూడా పరిచయం అయ్యారు. సాహిత్య పీఠంలో జరిగే సభలు, సదస్సులకు ఆయన వచ్చేవారు. గౌతమీ గ్రంథాలయం వైపు కెళితే ఒకటే సాహిత్య కబుర్లు. 2016లో నేను యానాం నుంచి కవిసంధ్య ప్రారంభించినప్పుడు ఆయన అందించిన ప్రోత్సాహం, ఇచ్చిన నైతిక బలం ఎంతో గొప్పది. శర్మ గారితో స్నేహం సాహిత్యంలో ప్రమోషన్‌గా భావిస్తాను నేను. 80 వసంతాల నవ యువకుడు మా సన్నిధానం గారికి శతమానం భవతి!

– శిఖామణి
98482 02526



మదురైలో విశ్వకవుల సదస్సు

యునెస్కో గుర్తింపు కల వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ సంస్థ ఏటా నిర్వహించే వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్ ప్రతిష్టాత్మక సదస్సు ఈ నవంబర్ 20 – 25 తేదీల మధ్య తమిళనాడులోని మదురైలో జరిగింది. రిథం ఆఫ్ హార్మోనీ అనేది ఈ ఏడాది సదస్సు కాన్సెప్ట్. జ్యోతి ప్రజ్వలన చేసి 43వ ప్రపంచ కవుల సదస్సును ప్రారంభించారు. ముఖ్య అతిథి కుంద్రకూడి పొన్నంబాల అడిగలర్, ప్రత్యేక అతిథిగా హాజరైన విద్యావేత్త, 2019 భువనేశ్వర్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య అచ్యుత సమంతకు జీవన సాఫల్య పురస్కారం, రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. మెక్సికన్ కవయిత్రికి ప్రత్యేక గుర్తింపు అవార్డు, మెడల్ బహుకరించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యత ప్రతిబింబించే కళారూపాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సదస్సు కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా డాక్టర్ పెరుగు రామకృష్ణ హాజరయ్యారు. వరల్డ్ తమిళ సంగం వేదికపై ప్రారంభ వేడుకలో విశ్వ అతిథుల సరసన పాల్గొన్నారు.

స్పానిష్, ఆంగ్లం మిశ్రమంగా జరిగిన తొలి కవితా సదస్సులో డా.రామకృష్ణ తన తెలుగు కవితను వినిపించారు. నేపథ్య అంశం మీద ఆంగ్ల కవితాగానం చేశారు. ఆంగ్ల కవిసమ్మేళనం, తమిళ కవి సమ్మేళనం సమాంతరంగా జరిగాయి. కవులందరూ సమకాలీన ప్రపంచ స్థితిగతులను ప్రస్తావించారు. యుద్ధ వ్యతిరేక కవితలు వినిపించారు. పర్యావరణ పరిరక్షణ, విశ్వ సౌభ్రాతృత్వం, ప్రపంచ శాంతి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కవులు విశ్వ సాహిత్యానికి చేస్తున్న కృషిని గుర్తించి వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్ అధ్యక్షులు, సుప్రసిద్ధ మెక్సికన్ కవయిత్రి మారియా యుజీనియా సొబెరిన్స్, ప్రధాన కార్యదర్శి మెక్సికన్ రచయిత్రి పాట్రీసియా గర్జా, ఇండియా సదస్సు అధ్యక్షులు డాక్టర్ సేతు కుమనన్ అందరికీ జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. ఇజ్రాయిల్, మెక్సికో, హంగేరి, జపాన్, ఈక్వాడర్, దక్షిణ ఆఫ్రికా, అమెరికా, రొమేనియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి, వివిధ భారతీయ భాషల నుంచి కవులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రిథం ఆఫ్ హార్మోని పేర బృహత్ విశ్వ కవితా సంకలనం వెలువరించారు. అనంతరం రామేశ్వరం, అబ్దుల్ కలాం స్మారక మందిరం, ధనుష్కోడిలలో ప్రకృతిలో పలు కవిత పఠనాలు చేయించారు. తమిళ కవి రవి సుబ్రహ్మణ్యన్ మంచి గీతాలను గానం చేసి అలరించారు. అన్ని దేశాల కవులు తమ మాతృభాషలను కవిత్వంలో పరిచయం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆంగ్ల కవితల పోటీలో సుప్రసిద్ధ భారతీయ ఆంగ్ల కవి గోపాల్ లాహిరి మొదటి బహుమతి 250 అమెరికన్ డాలర్లు గెలుచుకున్నారు. కారైకుడి సేతు భాస్కర అగ్రి కాలేజ్ రిసెర్చ్ ఫౌండేషన్ ప్రాంగణంలో 'పోయెట్స్ ఫారెస్ట్' పేర విచ్చేసిన కవులందరూ మొక్కలు నాటారు. మొక్కల పక్కన కవి పేరు, దేశం శాశ్వత ఫలకంగా చిత్రించడం కవులకు గొప్ప ఆనందం కలిగించింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 21–25 తేదీల్లో మెక్సికోలో 44వ కాంగ్రెస్ జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

– డాక్టర్ పెరుగు రామకృష్ణ
WAAC జీవిత సభ్యులు,
98492 30443

కాబోయే కథకులకు ఆరుద్రోపాయాలు



ఆరుద్ర బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసిన విలక్షణమైన రచనలతో ప్రసిద్ధులయ్యారు. తెలుగులో ఇంచుమించు అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. ఆయనిది చాలా పాపులర్ రచనా శైలి. ఏది రాసినా ఆసక్తికరంగా రాస్తారు. చమత్కారం, వ్యంగం, హాస్యం కలగలసిపోయి ఉండే ఆరుద్ర రచనాశైలి ఒక విచిత్రమైన అనుభూతిని పాఠకుడికి కలిగిస్తుంది. ఇది ఆరుద్ర శతజయంతి సంవత్సరం. ఆధునిక తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధ రచయితలలో ఆరుద్ర ఒకరు. కవిత్వం, సినిమా పాటలు, పద్యాలు, శుద్ధ మధ్యక్కరలు లాంటి ప్రక్రియలతో పాటు కూనలమ్మ పదాల వరకూ ఆరుద్ర తనదైన ముద్ర వేశారు. అన్నింటికీ మించి తెలుగు సాహిత్య చరిత్రను ఒంటిచేత్తో పరిశోధించి 'సమగ్రాంధ్ర సాహిత్యం' 13 సంపుటాల రచనతో సంచలనం కలిగించారు. ఈ సంపుటాలు తెలుగు సాహిత్య విద్యార్థులకు కరదీపికగా మారాయి. సరళమైన భాషతో, ఆసక్తికరమైన రచనా శైలితో సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర ఆరుద్రకు ఎంతో కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చాయి. సాహితీస్రవంతి ఆరుద్ర శతజయంతి సందర్భంగా వివిధ పట్టణాల్లో ఉత్సవాలను నిర్వహించ తలపెట్టింది. ఆరుద్ర విలువైన రచనల నుంచి కొన్నింటిని చిరు పుస్తకాలుగా ప్రచురించి తెలుగు పాఠకులకు అందించాలని నిర్ణయించింది.

అందులో భాగంగా తొలిగా 'కాబోయే కథకులకు పనికొచ్చే చిట్కాలు' పేరిట ఆరుద్ర రాసిన చిన్న వ్యాసాన్ని చిరు పుస్తకంగా జాషువా సాంస్కృతిక వేదిక, విజయవాడ పాక్షిక ఆర్థిక సహకారంతో సాహితీస్రవంతి ప్రచురించింది. కథలు రాయాలనే ఆసక్తి గల ఔత్సాహిక రచయితల నుద్దేశించి విలువైన సూచనలతో చమత్కారంగా ఈ వ్యాసం ఆరుద్ర రాశారు. కథలు రాయడంపై ఆసక్తి కలిగించే ఈ వ్యాసాన్ని అందమైన బాపు బొమ్మలతో 'రచన'లో తొలిసారిగా ప్రచురితమైంది. ప్రసిద్ధ చిత్రకారుడు బాపు అంటే ఆరుద్రకు చాలా ఇష్టం.

'కొంటెబొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండె వుయ్యేల నూపు
ఓ కూనలమ్మ' అని బాపుపై ఆరుద్ర రాసిన వ్యాసాలు 'బాపు' పై ఆరుద్ర అభిమానాన్ని చాటుతాయి. ఆరుద్ర, బాపు ఇద్దరూ కలిసి కథల రాయడం గురించి పాఠాలు చెబుతున్నట్లు ఉంటుంది ఈ పుస్తకం. ఆరుద్ర రాత, బాపు గీతల మేలుకలయిక ఈ చిరు పుస్తకానికి ఎంతో విలువను చేకూర్చింది. ఈ పుస్తకంలోని కథల చిట్కాలు పాఠకులలో కథారచన పట్ల ఆసక్తిని కలిగించడమే కాదు, కథా నిర్మాణం పట్ల అవగాహనను కూడా పెంచుతాయి. ముఖ్యంగా కొత్తగా రాసేవారికి చాలా విలువైన చిట్కాలు అందించారు ఆరుద్ర ఈ పుస్తకంలో. "కథ రాయాలంటే ఏం కావాలి? కథే కావాలి. చెప్పడానికేం లేకపోతే చెప్పేం ప్రయోజనం. కొంత మంది గొప్ప కథకులు ఏం లేకపోయినా గొప్ప గొప్పగా చెప్పేస్తారు. వాళ్ళు ఏమిటి వ్రాశారని కాదు. ఎలా వ్రాశారని మనం చదువుతాం. వాళ్ళలాగా చెయ్యి తిరిగాక అలా మీరూ రాయొచ్చుగాని ప్రస్తుతం కథ ఉన్న కథలే రాయండి" అంటారు ఆరుద్ర.

ఈ చిరు పుస్తకంలో ఆరుద్ర పాఠకుడితో సంభాషిస్తున్నట్లే ఉంటుంది. కథ ఎలా రాయాలో వివరిస్తూనే పాఠకుడి కళ్ళముందే చక్కటి కథను అల్లేసి అబ్బురపరుస్తారు. అంతేగాక వివరిస్తున్న కథను పూర్తిచేయకుండా 'నాకు ముగింపు నచ్చలేదు. ఈ వ్యాసం ముగిసేలోపు మీరు మంచి ముగింపును ఆలోచించి నాకు చెప్పండి' అని చమత్కారంగా పాఠకుడికి పని పెడుతూ ఆ కథలో భాగస్వామిని చేస్తారు. ఈ వ్యాసం చదివిన పాఠకుడికి కథ రాయడం ఇంత తేలికా అనిపిస్తుంది. కానీ మంచి కథలు రాయడం అంత తేలిక కాదు అనే హెచ్చరిక కూడా ఆరుద్ర చేస్తారు. అయితే మీకు బాగా రాయడం వచ్చాక అప్పుడు గొప్పకథలు రాద్దురు గాని ప్రస్తుతం మాత్రం ఇలాంటి కథలు రాసేయండని భుజం తడతారు ఆరుద్ర.

సాహితీస్రవంతి 2013లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'కథనశాల' పేరుతో కథల వర్క్‌షాప్ నిర్వహించింది. అప్పుడు తొలిసారిగా ఈ పుస్తకాన్ని ఆ వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారికి కానుకగా అందజేసింది. ఆ 'కథనశాల' విశేషాలతో సాహిత్య ప్రస్థానం మాసపత్రిక 'కథనశాల' పేరుతో ప్రత్యేక సంచిక వెలువరించింది. కొత్త కథకులకు, ఔత్సాహికులకు ఆ ప్రత్యేక సంచిక కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆ 'కథనశాల'కు ఈ వ్యాసం, 'బాపు' బొమ్మలతో సహా అనుబంధంగా చేర్చడం జరిగింది. ఆరుద్ర గారి ఈ చిరుపుస్తకంలో చివర ప్రసిద్ధ కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యం, చలం, చాసో, కొకు, బుచ్చిబాబు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, పాలగుమ్మి పద్మరాజు వంటి ప్రసిద్ధ కథకులు 'కథ'ల గురించి చెప్పిన కొన్ని విలువైన అభిప్రాయాలు కూడా అనుబంధంగా ఉన్నాయి.

'కథానిక అంటే మళ్లీ మళ్లీ చదివించే వచన ఖండకావ్యం. వెనక నుంచి సముద్రం హోరు వినిపిస్తూ చూడ్డానికి మాత్రం కెరటంలా కన్పించేది' – బుచ్చిబాబు

ఈ పుస్తకానికి అనుబంధంగా ఇచ్చిన ఇటువంటి కథా నిర్మాణ సూత్రాలు కొత్తగా కథలు రాయాలనుకునే వారికి కథాజ్ఞానాన్ని అందిస్తాయి. కొత్తగా కథలు రాయాలనుకునే వారికి ఈ చిరుపుస్తకం ఎంతైనా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజాశక్తి బుక్‌హౌస్ షాపుల్లో ఈ చిరుపుస్తకం లభిస్తుంది.

– వొరప్రసాద్
94900 99059

ప్రజాశక్తి
www.prajasakti.com

పిల్లల్లోనూ ఊబకాయం

- ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్న అధిక బరువు
- దేశంలో పెరిగిపోతున్న ఊబకాయులు

న్యూఢిల్లీ : ఊబకాయం...ఇది పెద్దల్లోనే కాదు. ఇటీవలి కాలంలో పిల్లల్లోనూ కన్పిస్తున్న వ్యాధి. కొందరు దీనిని తేలికగా తీసుకుంటున్నప్పటికీ ఈ వ్యాధి కారణంగా కలిగే అనారోగ్యాలు, అనర్థాలు అనేకం. 2030 నాటికి ప్రపంచంలో ఊబకాయంతో బాధపడే ప్రతి పది మంది పిల్లల్లో ఒకరు మన దేశానికి చెందిన వారే అవుతారని ఓ అంచనా. ఊబకాయంతో బాధపడే వారు మధుమేహానికి గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. ప్రపంచంలో సంఖ్యాపరంగా మధుమేహులు మన దేశంలో రెండో స్థానంలో ఉన్నారు. ఊబకాయం కారణంగా గుండె జబ్బులు, గుండె పోటు, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. మన దేశంలో ఊబకాయుల సంఖ్య పెరుగుతుండడంతో వారితో పాటు ఈ వ్యాధులూ పెరిగిపోతున్నాయి.

ఊబకాయులు పెరిగిపోతున్నారు

చిన్నతనంలోనే ఊబకాయంతో బాధపడే వారు క్లిష్టమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వయసు, ఎత్తుకు తగిన విధంగా కాకుండా ఎక్కువ బరువు ఉంటే దానిని ఊబకాయం అంటారు. అలాంటి వారిలో బాడీ-మాస్ ఇండెక్స్ (బిఎంఐ) 95 శాతం కంటే అధికంగా ఉంటుంది. మూడవ, ఐదవ (తాజాది) జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) ప్రకారం అధిక బరువు, ఒబెసిటీతో బాధపడుతున్న పిల్లల సంఖ్య 2005-06లో 1.9 శాతం ఉంటే 2019-20 నాటికి 4 శాతానికి పెరిగింది. 2030 నాటికి దేశంలో ఊబకాయంతో 2.7 కోట్ల మంది పిల్లలు బాధపడుతుంటారని అంచనా. యునిసెఫ్ ప్రపంచ ఒబెసిటి అట్లాస్-2022 ప్రకారం 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి మంది ఊబకాయ పిల్లల్లో ఒకరు భారత్‌కు చెందిన వారే అవుతారు.

కారణాలు ఇవే

ఒబెసిటితో బాధపడే చిన్నారులు కానీ, పెద్దలు కానీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురవుతారని వైద్యులు హెచ్చరించారు. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, గుండె పోటు, కిడ్నీ జబ్బులు వంటి సమస్యలను వారు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మన దేశంలో చిన్నారుల్లో ఊబకాయుల సంఖ్య పెరగడానికి కారణమేమిటని పరిశోధిస్తే జంక్ ఫుడ్, గంటల తరబడి టీవీలు, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, డ్రైవింగ్ వంటివి ప్రధాన కారణాలని తేలింది. పిల్లలు బొద్దుగా ఉంటేనే ముద్దొస్తారని తల్లిదండ్రులు అపోహపడుతూ వారి ఆరోగ్యంపై అశ్రద్ధ వహించడం కూడా సమస్యకు కారణమవుతోంది.

తల్లిదండ్రులూ కారణమే

1980వ దశకం వరకూ మన దేశంలో పిల్లలు బక్కగానే ఉండేవారు. అయితే 1990వ దశకం నుండి పిల్లలు బొద్దుగా ఉంటేనే బాగుంటుందనే అభిప్రాయం పెరిగింది. పేదరికం, ఆహార కొరత వంటి సమస్యల నుండి కోలుకుంటున్న దేశంలో బొద్దుగా ఉండే పిల్లలు సంపన్నతకు ఉదాహరణగా నిలుస్తారు. తమ పిల్లలు అధిక బరువును కలిగి ఉంటే సంతోషించే, గర్వంగా భావించే తల్లిదండ్రులు ఇప్పటికీ ఎంతో మంది మనకు కన్పిస్తుంటారు. దీర్ఘకాలంలో ఊబకాయం కారణంగా ఎదురయ్యే సమస్యలు వారికి తెలియకపోవడమే దీనికి కారణం. ఇప్పుడు మార్కెట్‌లో ఎక్కడ చూసినా స్నాక్స్, చాక్లెట్లు కన్పిస్తున్నాయి. వాటిలో ఉప్పు, చక్కెర అధికంగా ఉంటాయి. అవే ఊబకాయానికి ప్రధాన కారణమవుతాయి.

ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సి ఉంది. పిల్లలు లావుగా, బొద్దుగా ఉండకపోతే తల్లి సరిగా శ్రద్ధ చూపడం లేదనో, కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేదనో భావించే వారు మన సమాజంలో బాగానే ఉన్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల్లో నిమగ్నమయ్యే తల్లిదండ్రులు తమ పిల్లలకు తగిన సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో వారు డిమాండ్ చేసిన విధంగా ఫాస్ట్ ఫుడ్ అందిస్తూ, విషప్రాయమైన చక్కెర, ఉప్పు పదార్థాలు కొని తినిపిస్తూ సరిపెడుతున్నారు. పిల్లలు తల్లిదండ్రుల మాట వినడం లేదు. ఎందుకంటే తల్లిదండ్రులు తమ జీవితంలో బిజీబిజీగా గడిపేస్తూ పిల్లల్ని పట్టించుకోవడం లేదు. వారేమో ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌కు అలవాటు పడిపోతున్నారు' అని వైద్యులు వివరించారు.

వైద్యులు, అధ్యయనాలు ఏం చెబుతున్నాయి?

ప్రపంచ ఆరోగ్య సంస్థ మే నెలలో ఒక నివేదికను విడుదల చేసింది. యువత ఎక్కువగా చక్కెరతో కూడిన పానీయాలు తీసుకుంటున్నారని, ప్రతి రోజూ పండ్లు, కూరగాయలు తీసుకోవడాన్ని తగ్గించేశారని ఆ నివేదిక ఎత్తిచూపింది. ఊబకాయులైన బాలికలు పది సంవత్సరాలకే రజస్వల అవుతున్నారని పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ కవత్రా చెప్పారు. ఊబకాయం ఆస్థమా, లివర్, హార్మోన్ సమస్యలకు దారితీయడంతో పాటు పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుందని మరో పిల్లల నిపుణుడు రుచి గాబా తెలిపారు. ఊబకాయం కారణంగా పిల్లలు ఒత్తిడికి గురవతారని, అధిక బరువు శారీరక కార్యకలాపాలకు ప్రతిబంధకం అవుతుందని, సవాలుగా మారుతుందని వివరించారు.

బాలుడు లేదా బాలిక తన జీవితంలో తొలి వెయ్యి రోజులు అధిక చక్కెర తీసుకుంటున్నారని నవంబర్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం తెలిపింది. దీంతో గర్భధారణ సమయం నుండే డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి ఇబ్బందులు తప్పడం లేదని ఆ అధ్యయనం చెప్పింది. గర్భంతో ఉన్న మహిళ బరువు శిశువు ఆరోగ్యంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందని, పుట్టుకతోనే కాక ఆ తర్వాత జీవితంలో కూడా ప్రభావం పడుతుందని, గర్భంతో ఉన్న మహిళ ఏం తింటుందో అదే పిల్లలకు అలవాటు అవుతుందని గైనకాలజిస్టులు చెబుతున్నారు.




ఊబకాయులైన చిన్నారులతో రమేశ్ భాయి దంపతులు (ఫైల్ ఫొటో)

పేదరికమూ కారణమే

గుజరాత్‌లోని రమేశ్‌భాయి నంద్వానా దంపతులకు చెందిన ముగ్గురు పిల్లలూ ఊబకాయులే కావడంతో వారి ఆహారానికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సివస్తోంది. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితుల్లో తన కిడ్నీలను అమ్మేసి అయినా సరే పిల్లలన్ని కాపాడుకుంటానని రమేశ్ అన్నారు. దేశంలో ఊబకాయానికి పేదరికం కూడా ఒక కారణమని పలు సర్వేల్లో వెల్లడైంది. సరైన పోషణ ఆహారం అందిక పిల్లలు గిడసబారి ఆఖరకు ఇలా ఊబకాయులుగా మిగులుతున్నారన్న వైద్య నిపుణులు విశ్లేషణలూ ఉన్నాయి.

ఢిల్లీలో ఒంటరిగానే పోటీ చేస్తాం

- ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ఆమాద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ఉండదన్నారు. కాగా శనివారం తనపై జరిగిన లిక్విడ్ దాడిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. ఇదివరకు తాను ఢిల్లీ శాంతిభద్రతల సమస్యను లేవనెత్తానని, కేంద్రమంత్రి అమిత్ షా ఈ విషయంలో చర్యలు తీసుకుంటారని ఆశించానని చెప్పారు. కానీ, దానికి బదులు పాదయాత్రలో తనపైనే దాడి చేయించారని కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి తనపై లిక్విడ్ విసిరారని, అయితే ప్రమాదకర ద్రావకం కాదని అన్నారు. ఒకవేళ హానికరమైతే పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎన్ని దాడులు జరిగినా..తాము ప్రజాసమస్యలపై గొంతెత్తుతూనేవుంటామని తెలిపారు. ఇప్పటికైనా రాజధాని నగరంలో గ్యాంగ్‌స్టర్లను అదుపులోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆప్ నేతలను పదేపదే లక్ష్యంగా చేసుకుంటున్నారని వాపోయారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుయుక్తుల్లో భాగంగానే తమను టార్గెట్ చేస్తున్నారని ఆయన అన్నారు. ఇటీవల తమ పార్టీ ఎమ్మెల్యే ఒకరు అరెస్టయ్యారని, ఆ ఎమ్మెల్యేను కూడా గ్యాంగ్‌స్టర్లు వేధించారని గుర్తు చేశారు. కపిల్ సంగ్వాన్ నుండి తనకు కాల్స్ వస్తున్నాయని ఢిల్లీ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని అన్నారు.

క్రోనీ మిత్రుల సేవలో తరిస్తున్న కేంద్రం

- వయనాడ్ సభలో ప్రియాంక గాంధీ విమర్శ

తిరువనంతపురం : కోట్లకు పడగలెత్తిన అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ మిత్రుల సేవలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తరిస్తోందని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఇటీవల ఎన్నికైన కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. లోక్‌సభలో ప్రమాణం చేసిన అనంతరం తొలిసారి వయనాడ్‌లో పర్యటిస్తున్న ఆమె ఆదివారం మనంతవాడిలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. ప్రజల హక్కులను నిర్వీర్యం చేసే శక్తులకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తుంటే.. ప్రధాని మాత్రం తన కార్పొరేట్ స్నేహితుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఆమె విమర్శించారు. మన దేశ సంస్థలను నాశనం చేయడానికి యత్నిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వయనాడ్ ఎంపిగా ప్రజల అవసరాలు, హక్కుల కోసం పార్లమెంటులో తన గొంతుకను వినిపిస్తానని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రియాంక గాంధీ వయనాడ్ చేరుకున్న సంగతి తెలిసిందే. శనివారం రాహుల్‌గాంధీతో కలిసి వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని తిరువంబాడిలోని ముక్కం, నికంబూర్‌లోని కౌలై, వండూర్, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లోని ఎడవన్నలో బహిరంగ సభల్లో పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై మోడీ ఆందోళన

భువనేశ్వర్ : సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ కేంద్రంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక మోసాలు, నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతను కొందరు విద్రోహ చర్యలకు వినియోగిస్తున్నారని, కృత్రిమ మేధ ద్వారా డీప్ ఫేక్ కంటెంట్ సృష్టించడం, డిజిటల్ అరెస్టు వంటి మోసపూరిత చర్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. భువనేశ్వర్‌లో మూడు రోజుల పాటు జరిగిన 59వ పోలీస్ డిజి, ఐజిల అఖిల భారత సదస్సు ముగింపు సెషన్‌లో మోడీ ప్రసంగించారు. పని ఒత్తిడిని తగ్గించుకోవడానికి సాంకేతికను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 250 మంది అధికారులు హాజరయ్యారు. మరో 750 మంది వర్చువల్‌గా పాల్గొన్నారు.

హెచ్‌ఐవి నియంత్రణకు పటిష్ట చర్యలు

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

తిరువనంతపురం : కేరళలో ఎయిడ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫేస్‌బుక్‌లో విజయన్ ఈ మేరకు ఒక పోస్టు చేశారు. ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఐవి సోకిన వ్యక్తుల పునరావాసం కల్పించడంలోనూ, వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలోనూ ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించడాన్ని ఈ దినోత్సవం గుర్తు చేస్తుందని పోస్టులో తెలిపారు. కేరళలో హెచ్‌ఐవి సోకిన వ్యక్తుల సాంద్రత తక్కువగానే ఉన్నప్పటికీ, ఇక్కడ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. వ్యాధి నివారణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు చాలా ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని, ఈ వ్యాధిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 నాటికి కొత్త కేసులు లేని పరిస్థితిని సృష్టించాలని, అయితే ఈ లక్ష్యాన్ని కేరళ చాలా ముందుగానే 2025 నాటికే చేరుకునేలా కృషి చేస్తున్నామని విజయన్ తెలిపారు. ఈ మహమ్మారిని అరికట్టడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు.

తెగని మహా పంచాయితీ

- పదవుల పంపకంపై మహాయుతిలో పేచీ

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతికి మెజార్టీ వచ్చినా.. సర్కార్ ఏర్పాటుకు ఢిల్లీ వైపే చూస్తోంది. పదవుల పంపకాల్లో పేచీ బిజెపి అధిష్టానానికి తల బొప్పికడుతోంది. ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉన్నది. మహాయుతి కూటమిలోని నేతలు పైకి నవ్వుతూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నా..లోనమాత్రం కుతకుతలాడిపోతున్నారు. ఈ అసమ్మతి ఏ విధంగా చల్లార్చాలని మోడీ, అమిత్‌షా సమాలోచనలు చేస్తున్నా..ఈ రచ్చ ఎక్కడికి దారితీస్తుందోనన్న భయం కూడా వెంటాడుతోందని కూటమి శ్రేణుల్లో వినిపిస్తోంది. ఓ వైపు ఉప ముఖ్యమంత్రికే హోంశాఖను ఇవ్వాలని శివసేన పట్టుబడుతోంది. తమ నేత షిండేను పక్కనబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ బిజెపిపై గుర్రుగా ఉంటోంది. ఎన్‌సిపి చీలిక పార్టీకి అధినేతగా ఉన్న అజిత్ పవార్ మాత్రం బిజెపికే ముఖ్యమంత్రి పదవి అని, తమ పార్టీకి, శివసేనకు ఉప ముఖ్యమంత్రి పదవులు అని చెబుతున్నారు. ఇక సొంతూరిలో మకాం వేసిన అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదివారం మీడియా ముందుకు వచ్చారు. తమ కూటమిలో ఎలాంటి బేధాల్లేవని చెప్పారు. ముఖ్యమంత్రి ఎవ్వరనేది బిజెపి నిర్ణయానుసారమే ఉంటుందని చెప్పారు. ముంబయికి త్వరలో వెళ్తానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇప్పటికే హోంమంత్రి శాఖ కావాలంటున్న షిండే..తనయుడు శ్రీకాంత్ షిండేకు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. సిఎం ఎవరో తేల్చకుండానే ఐదో తేదీన ముహూర్తం ఖరారు కావటం..ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవుతున్న నేపథ్యంలో..పదవుల పేచీతో మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

మహారాష్ట్రను అవమానించడమే

- సిఎం ఎంపికలో జాప్యంపై ఆదిత్య థాకరే

ముంబయి : మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై ఉత్కంఠ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి వారం రోజులైనా ముఖ్యమంత్రి పేరును ఖరారు చేయడంపై బిజెపి నాన్చుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో బిజెపి తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరగడం మహారాష్ట్రను అవమానించడమేనని శివసేన (యుబిటి) ఎమ్మెల్యే ఆధిత్య థాకరే తప్పుబట్టారు. రాష్ట్రం పట్ల బిజెపి నిర్లక్ష్య ధోరణికి ఇది నిదర్శనమన్నారు. ఎన్నికల సంఘం (ఇసిఐ) అందించిన సహకారాన్ని కూడా అవమానించడమేనని ఆయన విమర్శించారు. గవర్నర్ వద్ద సంఖ్యా బలం చూపకుండానే ఏకపక్షంగా ప్రమాణ స్వీకార తేదీని ప్రకటించడం అరాచకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో అధికార మహాయుతి తీరు చూస్తుంటే.. నిబంధనలు కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే వర్తిస్తాయని, అధికార పార్టీలకు కాదని తెలుస్తోందని వ్యాఖ్యానించారు. ఒకవేళ ప్రతిపక్షం ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకపోతే.. ఈ పాటికే కేంద్రంలోని మోడీ సర్కార్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి ఉండేదని అన్నారు.



సంభాల్‌లో జ్యుడీషియల్ కమిటీ పర్యటన

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల హింసాకాండ చెలరేగిన సంభాల్‌లో జ్యుడీషియల్ కమిటీ ఆదివారం పర్యటించింది. స్థానిక షాహి జామా మసీద్‌లో మందిరం ఉందన్న అంశంపై సర్వే చేపట్టడాన్ని నిరసన ప్రదర్శన చేపట్టినవారిపై పోలీసులు కాల్పులు జరపడంతో నలుగురు ముస్లిం యువకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో హింసాకాండపై విచారణకు గత నెల 28న ఈ కమిటీని నియమించారు. మసీదు ప్రాంతంలోనూ, ఆందోళనలు చేపట్టిన ప్రాంతాల్లోనూ కమిటీ ఆదివారం పర్యటించింది. అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి దేవేంద్ర కుమార్ ఆరోరా నేతృత్వంలోని ఈ కమిటీలో మాజీ ఐపిఎస్ అరవింద్ కుమార్ జైన్, మరో మాజీ ఐఎఎస్ అమిత్ మోహన్ సభ్యులుగా ఉన్నారు. ఆదివారం నాటి పర్యటనలో అమిత్ పాల్గొనలేదు.

నవంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు 1.82 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు మరోసారి గణనీయ స్థాయిలో నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నవంబర్‌లో రూ.1.82 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఇందులో సిజిఎస్‌టి రూపంలో రూ.34,141 కోట్లు, ఎస్‌జిఎస్‌టి రూపంలో రూ.42,047 కోట్లు, ఐజిఎస్‌టి రూపంలో రూ.91,828 కోట్లు సమకూరాయి. సెస్సుల రూపంలో మరో రూ.13,253 కోట్లు వచ్చాయి. గతేడాది నవంబర్‌తో (రూ.1.68 లక్షల కోట్లు) పోలిస్తే జిఎస్‌టి వసూళ్లలో 8.5 శాతం పెరగడం గమనార్హం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌టి వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్కును దాటడం ఇది ఏడోసారి. ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.1.87 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు 9 శాతం వార్షిక వృద్ధితో రెండో అత్యుత్తమ వసూళ్లు కాగా.. 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూళ్లు వచ్చాయి. అయితే కేంద్రం చూపుతున్న జిఎస్‌టి వసూళ్లు అంకెల గారడీ అని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

మోడీ హయాంలో మైనార్టీలపై పెరిగిన దాడులు

- జర్మనీ మాజీ చాన్సలర్ మెర్కెల్

న్యూఢిల్లీ: భారత్‌లో నరేంద్ర మోడీ పాలనలో మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని జర్మనీ మాజీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ విమర్శించారు. ఇటీవల విడుదలచేసిన ఫ్రీడమ్ మెమరీస్ (1951-2021) పుస్తకంలో మెర్కెల్ ఈ విషయాన్ని పేర్కొన్నారు. హిందూత్వ మూకలు ఇతర మతాలకు చెందినవారిని మరీ ముఖ్యంగా క్రైస్తవులను, ముస్లింలను టార్గెట్‌గా పెట్టుకుని దాడులకు దిగడాన్ని ఆమె ప్రస్తావించారు. 2015 ఏప్రిల్‌లో జర్మనీ పర్యటనకు వచ్చిన మోడీతో జరిపిన సమావేశంలో ఇదే అంశాన్ని తాను లేవనెత్తానని, అయితే, మోడీ దానిని తీవ్రంగా తోసిపుచ్చారని అన్నారు. . తన ఆరోపణలను మోడీ తోసిపుచ్చినప్పటికీ వాస్తవ పరిస్థితి వేరుగా ఉందన్నారు. భారత్‌లో మత స్వేచ్ఛపై తన ఆందోళనలు అలాగే మిగిలిపోయాయని మెర్కెల్ పేర్కొన్నారు. ఏ ప్రజాస్వామ్యానికైనా కీలకం మత స్వేచ్ఛ అని ఆమె నొక్కి చెప్పారు. 2015 ఏప్రిల్‌లో జర్మనీలో మోడీతో తన మొదటి సమావేశాన్ని మెర్కెల్ వివరిస్తూ.. 'ఆయనకు.(మోడీకి) విజువల్ ఎఫెక్ట్స్ అంటే మోజు ఎక్కువ ' అని పేర్కొన్నారు.



ఏంజెలా మెర్కెల్

మోడీ తన ఎన్నికల ప్రచారం గురించి ఆమెతో మాట్లాడుతూ, 'తాను స్టూడియోలో మాట్లాడిన విషయాన్ని, తన చిత్రాన్ని 50కిపైగా ప్రదేశాల్లో 'హోలోగ్రామ్' గా ప్రదర్శించారు. 2014 సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో మోడీ హోలోగ్రామ్‌ను ఎక్కువగా ఉపయోగించారని ఆమె పేర్కొన్నారు..

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో తన సమావేశాన్ని గురించి మెర్కెల్ వివరించారు. విస్తృత స్థాయి ప్రపంచ అనుభవం కలిగిన ఆర్థిక వేత్త భారత దేశ ' మొట్టమొదటి హిందువేతర ప్రధాని ' అంటూ మన్మోహన్ సింగ్‌ను ఆమె అభివర్ణించారు. భారత దేశంలో అప్పటికి ఉన్న 120 కోట్ల జనాభాలో మూడింట రెండొంతుల మంది జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వీటి గురించే ఆయన ఎక్కువగా మాట్లాడారు. జర్మనీ జనాభా (8 కోట్లు) కన్నా భారత్ జనాభా అనేక రెట్లు అధికం.

ఆయనతో తన సంభాషించినప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాల పట్ల సంపన్న దేశాల వైఖరిపై ఆయనకున్న అనుమానాలను అర్థం చేసుకున్నాను. మన్మోహన్ సింగ్ తన దేశ సాంస్కృతిక వైవిధ్యం గురించి, అయిదు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఉపఖండం గురించి చెప్పారు. భారత రాజ్యాంగం 22 అధికారిక భాషలను గుర్తించిన విషయాన్ని , భిన్నత్వంలో ఏకత్వం గొప్పతనాన్ని గురించి చెప్పారని మెర్కెల్ పేర్కొన్నారు.

మెషిన్ ఫ్రీక్వెన్సీ మార్పుతో ఇవిఎంల హ్యాక్

- సోషల్ మీడియాలో పోస్ట్
- పోలీసులకు ఇసి ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)లను మెషిన్ ఫ్రీక్వెన్సీలను సవరించడం ద్వారా హ్యాక్ చేయవచ్చునని ముంబయికి చెందిన సయ్యద్ షుజా అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం ఇటీవల తీవ్ర కలకలం రేపింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇవిఎంలను హ్యాక్ చేయడంతో పాటు తాను ట్యాంపరింగ్ కూడా చేయగలనని సయ్యద్ పోస్టు చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇవిఎంలపై తప్పుడు వాదనలు చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో ముంబయి సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారని ఇసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అతడిపై ఢిల్లీలో కేసు నమోదైనట్లు పేర్కొంది. ప్రస్తుతం అతడు విదేశాల్లో ఉన్నట్లు తెలిపింది.

జనాభా తగ్గుదలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ఆందోళన

నాగ్‌పూర్ : దేశంలో జనాభా తగ్గుదలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో క్షీణత కొనసాగితే సమాజం దానంతట అదే నశించిపోతుందని ఆయన చెప్పారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మోహన్ మాట్లాడుతూ.. జనాభా తగ్గుదల అనేది ఆందోళనకర అంశమని, సంతానోత్పత్తి రేటు 2.1 కన్నా దిగువకు వెళ్తే.. సమాజం నశించే ప్రమాదం పొంచివుందని పేర్కొన్నారు. ఈ సమస్యతో ఇప్పటికే అనేక భాషలు, సంస్కృతులు కనుమరుగయ్యాయని తెలిపారు. భారత జనాభా విధానం కూడా ఈ రేటు 2.1 కన్నా తక్కువ ఉండరాదని చెబుతోందన్నారరు. ఇది కనీసం 3గా ఉండాలని ఆయన చెప్పారు.

కువైట్ విమానాశ్రయంలో భారతీయుల అవస్థలు

కువైట్: ముంబయి నుంచి ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్‌కు బయల్దేరిన గల్ఫ్ ఎయిర్ విమానం కువైట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న భారతీయులు కువైట్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. అమెరికా, ఇంగ్లండ్ పాస్‌పోర్టులు కలిగిన వారికి మాత్రమే హోటల్ సదుపాయాలు అందించడంతో ఆహారానికి, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 13 గంటలకు పైగా 100 మంది భారత్, పాక్‌కు చెందిన పౌరులు విమానాశ్రయంలో చిక్కుకొని తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఎయిర్‌పోర్టు అధికారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రయాణికులకు కలిగిన తీవ్ర అసౌకర్యాన్ని గల్ఫ్ ఎయిర్ దృష్టికి తీసుకెళ్లి వసతి కోసం ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొంది.

బ్రిక్స్ దేశాలపై వంద శాతం సుంకాలు

- ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్: అమెరికన్ డాలర్‌కు పోటీగా కొత్త కరెన్సీని బ్రిక్స్ కూటమి ముందుకు తెస్తే ప్రతీకారం తీర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ బెదిరించారు. వర్ధమాన దేశాలపై వంద శాతం సుంకాలు విధిస్తామన్న ట్రంప్ వ్యాఖ్యలు ప్రపంచ వ్యాపితంగా వాణిజ్యయుద్ధ భయాలు పెరిగిపోయాయి. ట్రంప్ శనివారం నాడు తన సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ 'ట్రూత్ సోషల్' ఓ పోస్ట్ పెడుతూ, డాలర్ స్థానే వేరే కరెన్సీకి మద్దతు ఇచ్చినా వంద శాతం సుంకాలు తప్పదని హూంకరించారు. అంతర్జాతీయ వాణిజ్యంలో బ్రిక్స్ లో బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, సౌతాఫ్రికా దేశాలు ఉన్నాయి. ఇప్పుడు ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఇరాన్ ఈ కూటమిలో కొత్తగా చేరాయి. ఇంకా అనేక దేశాలు చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. డాలర్‌ను అమెరికా ఒక రాజకీయ ఆయుధంగా వాడుతున్నందున ప్రపంచర ఆర్థిక వ్యవస్థతో డాలర్ లింక్‌ను తెగగొట్టాలని బ్రిక్స్ దేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డాలర్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి ట్రంప్ యత్నిస్తున్నాడు. డాలర్‌ను భర్తీ చేసేందుకు లేదా వేరే కొత్త కరెన్సీకి మద్దతు తెలిపినా అమెరికాతో ఆ దేశ సంబంధాలు తెగిపోయినట్టే భావించాల్సి వస్తుందని అన్నారు. తాను అధ్యక్షుడిగా తిరిగి బాధ్యతలు చేపట్టిన వెంటనే చైనా, మెక్సికో, కెనడాలపై భారీగా సుంకాలు విధిస్తానని బెదిరించిన వారం రోజులకే బ్రిక్స్‌పై ఆయన విరుచుకుపడ్డారు.


భోపాల్ విషాదంపై ముందే హెచ్చరించిన న్యాయవాది !

భోపాల్ : నలభై ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో జరిగిన దుర్ఘటన గురించి ఒక న్యాయవాది ముందే హెచ్చరించారు. భోపాల్‌ని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన విషవాయువులు పెను విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు సంబంధించిన పలు కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఫ్యాక్టరీ నుంచి విషవాయువులు వెలువడుతున్నాయని, దాన్ని మూసివేయాలని ఘటనకు ముందే నోటీసులు పంపినట్లు షానవాజ్ ఖాన్ (75) అనే న్యాయవాది తెలిపారు. అయితే, ఈ హెచ్చరికలను ఫ్యాక్టరీ యాజమాన్యం కొట్టిపారేసిందని వెల్లడించారు.

1983 మార్చి 4న యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెట్‌కు షానవాజ్ లీగల్ నోటీసులు పంపారట. 'ప్లాంట్ జనావాసాల మధ్య ఉంది. దీని నుంచి వెలువడుతున్న విషపూరిత వాయువులు, రసాయనాల నిల్వలతో సమీప కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే 50 వేల మంది ప్రాణాలకు హాని కలుగుతుంది. 15 రోజుల్లోపు మీ ఫ్యాక్టరీలో విషవాయువులు, ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని నిలిపివేయాలి. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది' అని తాను నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. 1981లో ఆ ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడు విషవాయువు లీకవడంతో మృది చెందారని ఖాన్ తెలిపారు. ఆ తర్వాత అక్కడ పలు మార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని వెల్లడించారు. ఈ క్రమంలోనే తాను యూసీఐఎల్‌కి లీగల్ నోటీసులు పంపించానన్నారు. అయితే, వాటిని యూసీఐఎల్ కొట్టిపారేసిందని ఖాన్ తెలిపారు. భోపాల్‌లో 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి విష వాయువులు లీక్‌అయిన దుర్ఘటనలో 3,787 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 5లక్షల మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దాని బాధితులు ఇంకా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు.

ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తన సన్నిహితుడు కాష్ పటేల్ (కశ్యప్ పటేల్)ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. ట్రంప్ తన యంత్రాంగంలో పలువురు భారత సంతతికి చెందిన వ్యక్తులకు కీలక పదవులను కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. ఎఫ్‌బిఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ (కశ్యప్) పటేల్‌ను ఎంపిక చేసినందుకు తాను గర్విస్తున్నానని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. కశ్యప్‌పై ఈ సందర్భంగా ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. కాష్ గొప్ప న్యాయవాది, పరిశోధకుడని, అమెరికా పక్షాన ముందు నిలిచే పోరాట యోధుడని కొనియాడారు. అమెరికా ప్రజల కోసం వృత్తిని సైతం కాష్ అంకితం చేశారని ట్రంప్ చెప్పుకొచ్చారు. గతంలో ట్రంప్ ప్రభుత్వంలో అమెరికా తాత్కాలిక రక్షణ కార్యదర్శి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా కాష్ పనిచేశారు. నేషనల్ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఉగ్రవాదం) సీనియర్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్‌కు గుజరాత్ మూలాలున్నాయి. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాకు చెందినవారు. తల్లి టాంజానియా, తండ్రి ఉగాండాకు చెందినవారు. 1970లో కెనడా నుండి అమెరికాకు వలస వచ్చారు. న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్.. రిచ్‌మాండ్ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. మియామీ కోర్టులో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.



తైవాన్‌కు ఆయుధాలిస్తే ప్రతిఘటన తప్పదు

- చైనా హెచ్చరిక

బీజింగ్: తైవాన్ ప్రాంతానికి 38,5 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను అమ్మాలన్న అమెరికా నిర్ణయంపై చైనా తీవ్రంగా స్పందించింది. తైవాన్‌కు ఆయుధాలిస్తే తాము గట్టి ప్రతిఘటన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి ఆదివారం స్పష్టం చేశారు. తైవాన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాలు, ఎలక్ట్రానికల్ స్కాన్డ్ ఎరే రాడార్లు, వాటి విడి భాగాలు, ఇతర ఆయుధాలను విక్రయించాలని నిర్ణయించినట్లు అమెరికా రక్షణ శాఖ గత శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం ఒకే చైనా అన్న సూత్రాన్ని, అలాగే అమెరికా- చైనా సంయుక్త ప్రకటనలను మరీ ముఖ్యంగా 1982 ఆగస్టు17 నాటి ప్రకటనను బాహాటంగా ఉల్లంఘించడమేనని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి విమర్శించారు. అంతేకాదు, అంతర్జాతీయ చట్టాన్ని కూడా అతిక్రమించడమేనని అన్నారు. తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్ధించబోమన్న ప్రకటిత వైఖరికి అమెరికా కట్టుబడకుండా అవకాశవాదంతో వ్యవహరిస్తోందని చైనా ఆరోపించింది. తైవాన్‌కు ఆయుధాల అమ్మకాన్ని తక్షణమే ఆపేయాలని చైనా కోరింది.

క్రికెట్ లీగ్‌లో అయోధ్య టెంపుల్ ట్రస్ట్

అయోధ్య : రామ మందిర నిర్మాణం జరిగిన అయోధ్యలో క్రికెట్ లీగ్ టోర్నమెంట్ జరగబోతోంది. అందులో పెద్దగా ఆశ్చర్యపడాల్సిన విషయమేమీ లేదు కానీ ఈ టోర్నమెంటులో పాల్గొంటున్న నాలుగు జట్లలో ఒక దానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రాతినిధ్యం వహించడమే వింతగా కన్పిస్తోంది. క్రికెట్ లీగ్‌లో ఎల్ అండ్ టీ లిమిటెడ్, టాటా కన్సల్టింగ్ ఇంజినీరింగ్ లిమిటెడ్, కెనరా బ్యాంక్ జట్లు కూడా పాల్గొంటున్నాయి. శ్రీరామ ప్రీమియర్ క్రికెట్ లీగ్ ఈ నెల 22న జరుగుతుంది. ప్రైవేటు కళాశాలకు చెందిన క్రికెట్ మైదానంలో ఈ పోటీలు జరుగుతాయి. టెన్నిస్ బాల్‌ను ఉపయోగించి టోర్నమెంట్ నిర్వహిస్తారు.



రామచిలుక సాయం



ఒక అడవిలో అందమైన పక్షులు చాలా ఉండేవి. అందులో ఒక చిన్న రామచిలుక కూడా ఉంది. మిగతా పక్షులు ఈ రామచిలుకను చాలా అవహేళన చేసేవి. అది నెమలి లాగా నాట్యం చేయలేదని, కోకిలలాగా పాడలేదని గేలి చేసేవి. రామచిలుక చాలా బాధపడేది, అయినా ఎవరినీ ఏమీ అనేది కాదు. ఒక రోజున అడవికి పెద్ద కీటకాల దండు వచ్చింది. ఆ దండు చెట్ల ఆకుల్ని తినేసి, అడవి మొత్తం నాశనం చేస్తోంది. మిగతా పక్షులన్నీ ఆ కీటకాలను పట్టుకోడానికి ప్రయత్నించాయి. వాటి వల్ల కుదరలేదు. అప్పుడు, చిన్న రామచిలుక తాను కీటకాలను పట్టుకుంటానని ముందుకు వచ్చింది. 'మేము పట్టుకోలేని ఈ కీటకాల దండుని నువ్వు ఏం పట్టుకుంటావులే' అని ఎప్పటిలానే మిగతా పక్షులు అవహేళన చేశాయి. కానీ రామచిలుక ఆ కీటకాలను సునాయాసంగా పట్టుకుంది. ఇది మిగిలిన పక్షులకి చాలా ఆశ్చర్యం కలిగించింది. అప్పటి నుండి పక్షులన్నీ రామచిలుకని తక్కువ చేసి చూడడం మానేశాయి. దాంతో స్నేహం చేయడం మొదలుపెట్టాయి.



– బెందాళం సిద్ధార్థ్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ముత్యాల పేట,
కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా.

నచ్చిన పాఠం 'మమకారం'



హాయ్ ఫ్రెండ్స్,

'మమకారం' అనే పాఠం నాకు ఇప్పటివరకు చెప్పిన అన్ని పాఠాల కంటే బాగా ఇష్టమైనది. మా మాస్టారు ఈ పాఠాన్ని భలే అర్థమయ్యేలా చెప్పారు. 'అవసరం కోసం మాత్రమే మనం ఆంగ్లభాషను నేర్చుకుంటాం, కానీ దాని మీద వ్యామోహంతో మాతృభాషను తక్కువ చేసి చూడడం మంచిది కాద'ని చెప్పారు. ఈ పాఠంలోని కవి ఇప్పుడు పిల్లలందరూ మమ్మీ డాడీ అని పిలుస్తూ, అమ్మానాన్న అనే పిలుపుని మర్చిపోతున్నారని చెప్పారు. తన స్నేహితుడు పిల్లలు ఆంగ్లంలో మాట్లాడతారు అనుకుంటే తనని మామయ్య అని పిలవడంపై చాలా సంతోషపడ్డానని ఒక సందర్భంలో అన్నారు. నిజం చెప్పాలంటే చివరలో ఆ పిల్లలకి మాతృభాషపై ఉన్న మమకారాన్ని చూసి, అతనికి ఆనందభాష్పాలు వస్తాయి. ఏ భాషనైనా సరే అవసరమైనంత వరకు మాత్రమే ఉపయోగించాలని మిగిలిన సమయంలో మన మాతృభాషలోనే మాట్లాడాలని ఈ పాఠం ద్వారా తెలుసుకున్నాను.



– ఎం.శ్రీంజయ్,
6వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

నేను గీసిన బొమ్మ



పోలుదాసు ధనుష్,
1వ తరగతి,
ఎంపిఎస్, వానపాముల (హెచ్‌డబ్ల్యు),
పెద పారుపూడి మండలం,
కృష్ణా జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



మీకోసం

చలికాలంలో గొంతునొప్పి బాధపెడుతుంటే మిరియాలను బుగ్గన పెట్టుకొని చప్పరిస్తూ ఉండాలి.

జీవన సౌరభం

తప్పును సరిదిద్దకుంటే అది మరింత ఆపదను తెచ్చి పెడుతుంది.



పెద్దోళ్ల 'శ్రమ'వారం!

ప్రతి ఆదివారం అక్కడ 70 ఏళ్లు పైబడిన వారంతా చీపుర్లు, చేటలు పట్టుకుని వీధులు ఊడ్వడం, చెత్త సేకరించడం విధిగా చేస్తున్నారు. ఒకటి, రెండు కాదు, పదేళ్లకి పైగా ఈ పనిలోనే వారంతా నిమగ్నమై ఉన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత దొరికిన తీరిక సమయాన్ని సమాజసేవ కోసం వెచ్చిస్తున్న ఈ పెద్దవాళ్లు భువనేశ్వర్ బాలాసోర్‌కి చెందినవారు. పరిసరాల పరిశుభ్రతపై సమావేశాలు నిర్వహించడం, అవగాహన కల్పించడంతో సరిపెట్టక, స్వయంగా కార్యరంగంలోకి దిగిన వీళ్ల గురించి ఇంకొంత తెలుసుకుందాం.

బాలాసోర్ గోపాల్‌పూర్‌కి చెందిన వీరిలో ఎక్కువమంది ప్రభుత్వ ఉద్యోగాల నుంచి రిటైర్ అయినవారు. 77 ఏళ్ల సుదర్శన్ మొహాపాత్ర, ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకల్లా శుభ్రంగా తయారై ఎర్ర చొక్కా వేసుకుని కమ్యూనిటీ రూమ్‌కి చేరుకుంటారు. అక్కడికి అతని వయసువారే మరికొంతమంది వచ్చి చేరతారు. అందరు ఎర్ర చొక్కాలతో సిద్ధమై అప్పటికే నిర్దేశించుకున్న ప్రాంతాన్ని శుభ్రం చేసేందుకు చీపుర్లు, చేటలతో బయలుదేరతారు. దారిలో కనిపించిన అడ్డంగా పెరిగిన తుప్పలు, పిచ్చి మొక్కలను నరుకుతూ రహదారి శుభ్రం చేస్తూ వెళ్లడం వాళ్ల పని.

ప్రతి ఆదివారం రెండు గంటలు శ్రమపడుతున్న వీళ్లు పరిసరాల శుభ్రతపై పిల్లలకు, పెద్దలకు అవగాహన కల్పించడంలో కూడా ముందుంటారు. అవగాహనా కార్యక్రమాల కోసం కాలేజీలకు, స్కూళ్లకి, మార్కెట్లకు వెళతారు. రోడ్లు, బీచ్‌లు, పబ్లిక్ ప్లేస్‌లు ఎక్కడ చెత్త ఎక్కువగా పేరుకుపోతుంటే అక్కడ ప్రత్యక్షమైపోతారు. ప్రభుత్వం నుంచి సాయం ఆశించకుండా, ఈ సేవను స్వచ్ఛందంగా చేస్తున్నారు.. అవసరమైన సామగ్రి పెన్షన్ సొమ్ము నుండో, పొదుపు నుండో తీసి ఖర్చు పెడుతున్నారు. మొదట పది మందితో మొదలైన ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రస్తుతం 107 మంది సభ్యులు ఉన్నారు. ఈ బృందం ఇప్పటివరకు 684 వారాలు విరామం లేకుండా శ్రమించింది.

పెద్దవారు చేస్తున్న కృషికి తమ వంతుగా పిల్లలు, మహిళలు, రోజు కూలీలు కూడా వీరితో చేయి కలుపుతున్నారు. 50 గ్రామాల్లో వీరి సేవలు విస్తరించాయి. స్కూళ్లు, కాలేజీలతో పాటు బీచ్‌లు, పూరీ ఆలయం, రామ్‌చండి, చంద్రభాగ వంటి 20 పర్యాటక ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పటళ్లు వంటి జనరద్దీ ఎక్కువగా ఉండే చోట కూడా చీపుర్లతో ఊడుస్తున్నారు. ఇప్పటివరకు 40కి పైగా స్కూళ్లల్లో, ఇతర చోట్ల, 105కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారంటేనే వీరి కృషి అర్థం చేసుకోవచ్చు.

ఈ సేవలు నచ్చి ఎవరైనా వీళ్లతో కలసి పనిచేయాలంటే నామమాత్రపు రుసుము రూ.10 చెల్లిస్తే చాలని బృంద నాయకులు నిర్ణయించారు. అలా ఈ బృందంలో భాగమైన మాజీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి శ్రీకంఠ పాండా ఇలా చెబుతున్నారు... : 'నేను వీళ్ల నుండి చాలా స్ఫూర్తి పొందాను. రెండేళ్ల క్రితమే వీళ్లతో కలసి పనిచేయడం ప్రారంభించాను. చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. ఆ కార్యక్రమంలో మనమే స్వయంగా భాగమైతే ఆ ఆనందమే వేరు' అంటున్నారు.

పెద్దలంతా ఇంత బాధ్యతగా పర్యావరణంపై అవగాహన పెంచుతుంటే అది చూసిన స్థానికులు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మొదలుపెట్టారు. మార్కెట్లో వ్యాపారులు వృథాగా ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడం మానేశారు. మార్కెట్‌కి వచ్చేవాళ్లు కూడా పాల్‌థీన్ కవర్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ తీసి శుభ్రం చేస్తున్నారు. స్కూలు, కాలేజీ పిల్లలు అయితే తమ ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా శ్రద్ధ వహిస్తున్నారు. వస్తువులు కొనుక్కునే వినియోగదారుల్లో ఎక్కువశాతం మంది పాల్‌థీన్ కవర్లకు ప్రత్యామ్నాయం వైపు మళ్లారు. ఈ మార్పు కోసమే కదా ఈ పెద్దవాళ్లు శ్రమించింది.

చలి కాలం ఇలా ఉండాలి!



చలికాలం ఆహారపు అలవాట్లను మార్చుకుంటే ఈ కాలంలో ఎదురయ్యే సమస్యల నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది. అయితే చాలామంది చలి నుంచి తక్షణ ఉపశమనం కోసం టీ, కాఫీలు ఎక్కువగా తాగుతుంటారు. దీనివల్ల పొట్టలో అల్సర్ సమస్య తలెత్తుతుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇంకా ఏమేం తినాలి.. తినకూడదో చూద్దాం..

నీళ్లు తాగాలి

దాహం ఉన్నా, లేకపోయినా రోజులో కనీసం నాలుగు లీటర్ల నీటిని కొంచెం కొంచెంగా తీసుకోవాలి. అప్పుడే చర్మం తెల్లగా, ఎండిపోయినట్లు ఉండకుండా మెరుస్తూ ఉంటుంది.

మసాలా ఫుడ్ తగ్గించాలి

చలికాలం వచ్చిందంటే చాలా మంది కారం కారంగా, వేడిగా ఉన్న మసాలా ఫుడ్‌ను తింటూ ఉంటారు. అయితే ఇలా చేయడం వల్ల జీర్ణకోశకు సంబంధించిన సమస్యలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. తరుచూ ఆయిల్, మసాలా ఆహారం తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారి తీయొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

అదుపులో కార్బోహైడ్రేట్స్

చలికాలంలో శరీరంలో సెరోటోనిన్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణుల అంటున్నారు. అందువల్ల మనకు ఎక్కువగా కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారం తీసుకోవాలనే కోరిక కలుగుతుంది. రైస్, బ్రెడ్, అరటి, దుంపల్లో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి రోజూ తీసుకోవడం వల్ల రక్తపోటు, మధుమేహం స్థాయిలు పెరుగుతాయి. అందుకే ఈ ఆహారం పట్ల అదుపు అవసరం.

జలుబు, దగ్గు నుంచి ఉపశమనం ఇలా..



- తులసి ఆకుల్లో యాంటిబయాటిక్స్ ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ నాలుగు ఆకులు నోట్లో పెట్టుకుని, నిదానంగా నమలడం వల్ల జలుబు, ఫ్లూ రావు. కడిగిన తులసి ఆకులను మరిగించిన నీళ్లలో వేసి తాగితే గొంతులో కఫం నుంచి ఉపశమనం లభిస్తుంది.
- అల్లంలోని గుణాలు రోగనిరోధక శక్తిని బలపరచేలా చేస్తాయి. జలుబు బారిన పడిన వారికి త్వరగా కోలుకోవడానికి అల్లం బాగా సహాయపడుతుంది. గొంతు నొప్పితో బాధపడే వారు వేడి పాలలో గానీ, కషాయంలోగానీ అల్లం వేసుకుని తాగాలి.
- చిన్న పిల్లలకు జలుబు చేసినప్పుడు కఫం పేరుకుపోతుంది. అప్పుడు అరలీటర్ నీటిలో స్పూన్ వాముపొడి, స్పూన్ పసుపు వేసి చల్లారాక తేనె కలిపి కొంచెం కొంచెంగా తాగించాలి. దాంతో కఫం కరిగిపోతుంది. మెత్తగా దంచిన వామును ఒక స్పూన్, గ్లాస్ మజ్జిగకు కలిపి తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులకు గాలిని చేరవేసే మార్గం శుభ్రపడుతుంది.
- రోజూ రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలల్లో కాస్త పసుపు, మిరియాల పొడి కలిపి తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శరీరంలో చలి తగ్గుతుంది.
- కర్పూరాన్ని నువ్వులనూనెలో కరిగించి దాంతో తల, ఛాతీ, పాదాలకు మసాజ్ చేస్తూ ఉండాలి. జలుబు బాగా చేసినప్పుడు వేడినీటిలో స్పూను పసుపు, కర్పూరం వేసి ఆవిరి పట్టాలి.

వెండితెరపై విశాఖ ఉక్కు పోరాటం



విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రయివేటీకరణ వద్దని కోరుతూ కార్మికలోకం గత 1392 రోజులకు పైబడి పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం విదితమే. అయినా మొండిగా కేంద్రం వ్యవహరిస్తుండగా, గత ప్రభుత్వం వత్తాసు పలికింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడుతూ కార్మికులను మభ్యపెట్టి దొడ్డిదారిన ప్రయివేటీకరణ ప్రయత్నాలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో పి.సత్యారెడ్డి ప్రధాన పాత్రలో నటించి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఉక్కు 'సత్యా'గ్రహం సినిమా నవంబర్ 29న విడుదలైంది. మేఘన లోకేష్, గద్దర్, ఎంవివి సత్యనారాయణ, ధర్మశ్రీ, అయోధ్యరామ్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. విశాఖ స్టీల్ అంశాన్ని ప్రధానంగా తీసుకుని తెరకెక్కించారు. గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ రాసిన గీతం ఆకట్టుకుంది. గద్దర్ రచించి, పాడిన 'సమ్మె నీ జన్మహక్కురన్నో...' అంటూ సాగే పాటను ప్రధాన పాత్రధారి సత్యారెడ్డి, ఇతర ఆర్టిస్టులతో పాటు గద్దర్‌పైన ఆసక్తికరంగా సాగుతుంది. ఇందులో మూడు పాటలను గద్దర్ పాడారు. ఇప్పటివరకూ తాను ఏ సినిమా తీసినా అందులో సామాజిక అంశాలను మిళితం చేసే సత్యారెడ్డి ఇప్పటివరకూ ప్రత్యూష, సర్దార్ చిన్నపరెడ్డి, రంగుల కళ, కుర్రకారు, అయ్యప్పదీక్ష, గ్లామర్, సిద్ధం, ప్రశ్నిస్తా వంటి 42 చిత్రాలను నిర్మించారు. దర్శక, నిర్మాతగానే కాకుండా నటుడిగా కూడా తన అభిరుచిని చాటుకుంటున్న సత్యారెడ్డి ఉధృతంగా సాగుతున్న 'విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం ప్రధాన అంశంగా చేసుకుని 'ఉక్కు సత్యాగ్రహం' పేరుతో సినిమాను తీశారు. తాను ప్రధాన పాత్ర పోషించటమే కాకుండా, స్వీయ నిర్మాణ దర్శకత్వంలో జనం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సత్యారెడ్డి రూపొందించిన సినిమా ఇది. సుద్దాల అశోక్‌తేజ, గోరటి వెంకన్న, చంద్రబోస్ రాసిన పాటలూ ఆకట్టుకున్నాయి. ప్రముఖ నటీనటులతోపాటు విశాఖ స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు, రాజకీయ ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు నటించారు. ఈ చిత్రానికి సంగీతం శ్రీకోటి, కెమెరా వెంకట్, నిర్మాణ సారథ్యం పి.సతీష్‌రెడ్డి, సహనిర్మాతలు సంఘం శంకర్‌రెడ్డి, కుర్రి నారాయణరెడ్డి, శేషుబాబు యాదవ్, రచనాసహకారం శ్రీ వేములు, నిర్వహణ పోలిశెట్టి వెంకటనాగు.

ప్రయివేటీకరణ ఆపాలంటూ నినాదం

ఇందులో గద్దర్ నటించిన పాత్రల ద్వారా 'విశాఖ ఉక్కు.. .ఆంధ్రుల హక్కు' అని కార్మికులు నినాదాలు చేస్తుంటే.. పాలకులు ప్రయివేటీకరణ చేస్తాననడం న్యాయమా? అంటూ ప్రశ్నిస్తారు. రాజకీయ పార్టీలు కూడా పాల్గొనాలి.. ఈ సమస్య కేవలం విశాఖపట్టణం ప్రజలది మాత్రమే కాదనీ, తెలుగు ప్రజలందరిదీ.. తెలుగువారంతా ఏకమైతేనే ఈ ప్రయివేటీకరణను ఆపగలగమని నమ్ముతున్నా' అంటూ పాటల్లోనూ, తన నటించిన పాత్రల ద్వారా గద్దర్ ప్రస్తావించారు.

ఉద్యమస్ఫూర్తే కథనం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ సంఘటన నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం సాగుతుంది. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడటానికి ఆనాటి నాయకుల త్యాగాలు... నేడు ప్రయివేటీకరణ చేయటానికి పాలకులు చేస్తున్న కుతంత్రాలు మొదలైన సంఘటనల ఆధారంగా చేసుకుని కథ మొత్తం సాగుతుంది. పరిశ్రమ ఏర్పాటు సమయంలో జరిగిన సన్నివేశాలు, దానికి ఉద్యమకారులు ఎలాంటి సపోర్టు చేశారు? బహుళజాతి కంపెనీలు ఈ ప్లాంట్ ప్రయివేటు పరం కావటానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయి? చేశాయి? వంటి అంశాలను కూడా చూపించారు.

షూటింగ్ అంతా విశాఖలోనూ..

ఈ సినిమా షూటింగ్ చాలావరకూ విశాఖపట్టణంలోనే చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ సమయంలోనూ అక్కడ జరిగిన వివిధ పోరాట ఘట్టాలను తెరపై చక్కగా చూపించారు. పోరాట రూపాలను కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. పల్సర్ ఝాన్సీ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలోనూ, ఉద్యమకారిణిగా పాత్రలోనూ నటించి, మెప్పించారు. ఉద్యమకారుడి పాత్రలో సత్యారెడ్డి చక్కగా నటించారు. ఆయన డైలాగ్ డెలివరీ కూడా బాగుంది. గద్దర్ కూడా కొన్ని సన్నివేశాల్లో సత్యారెడ్డితో కలిసి నటించారు. ఉద్యమ ఘట్టాల్లో వీరిద్దరి రోల్ సినిమాలో చాలా ఆకట్టుకునేలా ఉంటుంది. గద్దర్ పాత్ర నిడివి తక్కువే అయినప్పటికీ సినిమాకు ఈ సీన్లు అదనపు బలాన్ని తెచ్చాయి. సాంకేతిక పరంగా కూడా మంచిగానే ఈ సినిమాను తెరకెక్కించారు. స్టీల్‌ప్లాంటు ప్రయివేటీకరణ యత్నాల నేపథ్యంలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకులు తోడ్పాటునివ్వడం చాలా అవసరమని దర్శక నిర్మాత సత్యారెడ్డి కోరారు.

టీమిండియా ఆల్‌రౌండ్ షో

రాణించిన గిల్, యశస్వి
ఆకట్టుకున్న నితీశ్, వాషింగ్టన్
వార్మప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పిఎం ఎలెవన్‌పై భారత్ ఘన విజయం



కాన్‌బెర్రా(ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియాతో డే/నైట్ టెస్టు ముంగిట ఆస్ట్రేలియా పిఎం ఎలెవన్‌తో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గులాబీ బంతితో జరిగిన ఈ మ్యాచ్‌ను 50 ఓవర్ల చొప్పున నిర్వహించాలనుకున్నారు. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వర్షం అంతరాయం కలిగించడంతో 46 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా పిఎం ఎలెవన్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సామ్ కాన్స్టస్ (107: 97 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదాడు. 241 పరుగుల లక్ష్యాన్ని భారత్ 42.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇది ప్రాక్టీస్ మ్యాచ్ కాబట్టి మిగిలిన 3.1 ఓవర్లలో కూడా భారత్ బ్యాటింగ్ చేసింది. 46 ఓవర్లలో భారత్ 257/5 స్కోరు చేసింది.

బౌలింగ్‌లో రాణించిన భారత్ బ్యాటింగ్‌లోనూ సత్తాచాటింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (45 : 59 బంతుల్లో 9 ఫోర్లు), కెఎల్ రాహుల్ (27 రిటైర్డ్ హర్ట్ : 44 బంతుల్లో 4 ఫోర్లు) శుభారంభం అందించారు. తర్వాత వచ్చిన శుభ్‌మన్ గిల్ (50 రిటైర్డ్ హర్ట్ : 62 బంతుల్లో 7 ఫోర్లు), నితీశ్ కుమార్ రెడ్డి (42 : 32 బంతులలో 5 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (42 : 36 బంతుల్లో 5 ఫోర్లు), రవీంద్ర జడేజా (27 : 31 బంతుల్లో) రాణించారు. నాలుగో స్థానంలో వచ్చిన కెప్టెన్ రోహిత్ (3) మాత్రం నిరాశపర్చాడు. కోహ్లీ బ్యాటింగ్‌కు దిగలేదు. ఆస్ట్రేలియా పిఎం ఎలెవన్ బౌలర్లలో చార్లీ ఆండర్సన్ 2, లాయిడ్ పోప్, రెన్‌షా చెరో వికెట్ పడగొట్టారు.

ఈనెల 6 నుంచి భారత్, ఆసీస్ మధ్య రెండో టెస్టు (పింక్ బాల్ టెస్టు) ప్రారంభంకానుంది. డే/నైట్ జరిగే ఈ మ్యాచ్‌కు అడిలైడ్ ఓవల్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది.

ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ బ్యాటర్లలో కాన్స్టస్‌తోపాటు తొమ్మిదో స్థానంలో వచ్చిన హన్నో జాకబ్స్ (61 : 61 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జాక్ క్లేటన్ (40 : 52 బంతుల్లో 6 ఫోర్లు) రాణించాడు. భారత బౌలర్లలో యువ పేసర్ హర్షిత్ రాణా (4/44) అదరగొట్టాడు. ఆకాశ్ దీప్ 2, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు.



భారత్ షట్లర్ల మెరుపులు

- సింధు, లక్ష్య, గాయత్రి-ట్రెసాలకు టైటిల్స్
- సయ్యద్ మోడీ ఇండియా ఓపెన్

లక్నో (ఉత్తరప్రదేశ్) : సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ ఓపెన్‌లో భారత షట్లర్లు మెరిశారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మన షట్లర్లు సత్తాచాటారు. ఐదు విభాగాల్లో ఏకంగా మూడింట విజేతలుగా నిలిచారు. మహిళల సింగిల్స్‌లో పివి సింధు 21-14, 21-16తో చైనా షట్లర్ యుయును చిత్తు చేసింది. వరుస గేముల్లోనే ప్రత్యర్థిని మట్టికరిపించి సుదీర్ఘ విరామం అనంతరం టైటిల్ సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్యసేన్ ఛాంపియన్‌గా నిలిచాడు. 21-6, 21-7తో ఇండోనేషియా షట్లర్ జియపై ఏకపక్ష విజయం సాధించాడు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి, ట్రెసా జాలి జంట సైతం అదరగొట్టారు. 21-18, 21-11తో చైనా జోడీ జింగ్, లిలపై వరుస గేముల్లో విజయం సాధించారు. పురుషుల డబుల్స్ ఫైనల్లో పృథ్వీ, సాయి ప్రతీక్ జోడీ 14-21, 21-19, 17-21తో మూడు సెట్ల పోరాటంలో చైనా జోడీ చేతిలో ఓటమి చెందారు. మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ పోరులో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు సైతం 21-18, 14-21, 8-21తో థాయ్‌లాండ్ జంట చేతిలో పోరాడి ఓడారు.

ఐసిసి ఛైర్మన్‌గా జై షా

- బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తనయుడు



దుబాయ్ : కేంద్ర హోంశాఖ మంత్రి కుమారుడు, బిసిసిఐ మాజీ కార్యదర్శి జై షా ఆదివారం నుంచి ఐసిసిలో సరికొత్త శకాన్ని మొదలుపెట్టాడు. 36 ఏళ్ల జై షా.. ఐసిసి కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఈ పదవి చేపట్టిన అతి పిన్నవయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. 'ఐసిసి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఐసిసి డైరెక్టర్లు, సభ్య దేశాల మద్దతుకు ధన్యవాదాలు. లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఉండబోతున్న తరుణంలో బాధ్యతలు చేపట్టడం ఉత్సాహంగా ఉంది. అందరి సహకారంతో ఆటను పురోగతి బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని' జై షా తెలిపారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా, ఐసిసి ఫైనాన్స్-కమర్షియల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్‌గా జై షా పని చేశారు.

ఉత్సాహంగా పికిల్‌బాల్ టోర్నమెంట్

- చాంపియన్స్ అనిరుధ్, విక్రమ్ లగడపాటి

హైదరాబాద్ : ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఆలిండియా టోర్నమెంట్‌లో అనిరుధ్ సోమ్‌పల్లి, విక్రమ్ లగడపాటి టైటిల్ సాధించారు. ఓ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి నిధుల సమీకరణకు కొండాపూర్‌లోని పికిల్‌బాల్ ఏరినాలో డిసెంబర్ 1న టోర్నమెంట్ నిర్వహించారు. ఫండ్ రైజర్ టోర్నమెంట్‌కు విశేష స్పందన రావడంతో రోజంతా మ్యాచులు సాగాయి. పికిల్‌బాల్ పోటీలతో పాటు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, ఫిట్‌నెస్‌పై వర్క్‌షాపులు నిర్వహిస్తూ సందడిగా జరిగింది. దాసోస్ క్యాబినెట్స్, ఏరెటె హాస్పిటల్స్, నేయ స్కిన్ క్లినిక్ సహా సాత్విక రుచులు ఈ ఫండ్ రైజింగ్ టోర్నమెంట్‌కు మద్దతు పలికాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68